



గొల్లప్రోలు మండలం దుర్గాడలో గృహాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



దశ తిరిగినట్టే!

6

కాకినాడలో ఏఎంజీ మెటల్ కంపెనీ భారీ పెట్టుబడి.. రూ.44వేల కోట్లతో అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్ ఏర్పాటు

కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులోని సూర్యారావుపేటలో నిర్మాణం.. పలు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



ఎవరికి వారే..

- జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు అస్తవ్యస్తం
- పర్యవేక్షించే నాథుడు లేక ఇష్టానుసారంగా విధుల నిర్వహణ
- కొందరు ఉద్యోగులపైనే అత్యధిక పనిభారం
- అనేక సచివాలయాల్లో అనధికారికంగా విధులకు డుమ్మా
- అనేకమంది ఫీల్డ్ సర్వే పేరుతో బయటే కాలక్షేపం
- గ్రామ, వార్డు సచివాలయాల్లో అనేక లోపాలు వెలుగులోకి..

'ఆంధ్రజ్యోతి' విజిట్..

(కాకినాడ, ఆంధ్రజ్యోతి బృందం)

గ్రామ, వార్డు సచివాలయాలు ప్రజలకు పల్లె ముంగిటకే ప్రభుత్వ పాలన అందించేందుకు ఏర్పాటైన వ్యవస్థ. కానీ ఇప్పుడిది అస్తవ్యస్తం.. గందరగోళంగా మారింది.. ఏ సచివాలయంలో చూసినా అడుగడుగునా లోపాలు, బాధ్యతా రాహిత్యమే కనిపిస్తోంది.. పర్యవేక్షించే నాథుడు లేక కొందరు ఉద్యోగులు ఎంచక్కా టైంపాస్ కొలువులు చేస్తున్నారు. కొందరు రోజంతా ఏ పనీ లేకుండా ఖాళీగా కూర్చుని వెళ్లిపోతున్నారు. మరికొందరు ఉద్యోగులకైతే ఉక్కిరిబిక్కిరి విధులతో ఆపసోపాలు పడుతున్నారు.. ఇంకొందరైతే తమను అడిగేవారు లేరని ఏకంగా నెలల తరబడీ సచివాలయాలకు అనధికారికంగా డుమ్మా కొట్టేస్తున్నారు. పేరుకు ఫీల్డ్ సర్వే పేరుతో అనేక మంది ఉద్యోగులు బయటే కాలక్షేపం చేస్తున్నారు.. సచివాలయాల్లో కొందరికి పనిభారం అధికంగా ఉంటే మిగిలిన వారు ఏపనీ లేక కాలక్షేపం చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల సచివాలయాల రీగ్రూపింగ్.. క్లస్టర్ల విభజన.. ఉద్యోగుల హేతుబద్ధీకరణకు ఆదేశాలు జారీచేసినా అదెక్కడా అమలవక సచివాలయాల పనితీరు నాసిరకంగా మారాయి. జిల్లాలో మొత్తం గ్రామ,వార్డు సచివాలయాలు 620 ఉండగా, వీటి పనితీరుపై జిల్లావ్యాప్తంగా 'ఆంధ్రజ్యోతి' విజిట్ నిర్వహించింది. వీటి పనితీరును పరిశీలించగా, ఎక్కడికక్కడ సచివాలయాల్లో అస్తవ్యస్త పరిస్థితులు.. అనేక మంది ఉద్యోగుల్లో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం.. సిబ్బంది అనధికారిక డుమ్మాలు కనిపించాయి.

ఆడుతూ పాడుతూ...

జిల్లాలో 445 గ్రామ సచివాలయాలు, 175 వార్డు సచివాలయాలు కలిపి మొత్తం 620 ఏర్పాటుచేశారు. వీటికోసం మొత్తం 5,200 మంది ఉద్యోగులను నియమించారు. ప్రస్తుతం వీటిలో 1035పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల విధులకు సంబంధించి కనీసం శిక్షణ కూడా ఇవ్వకుండా వదిలేసింది. ఇప్పుడు ప్రభుత్వం మారి ఏడాదిన్నర అవుతోంది. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల పనితీరుపై 'ఆంధ్రజ్యోతి' జిల్లావ్యాప్తంగా విజిట్ నిర్వహించింది. ఇందులో అనేక వైఫల్యాలు వెలుగులోకి వచ్చాయి. పిఠాపురం నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కేవలం కొందరు ఉద్యోగులపైనే అధిక పనిభారం పడుతోంది. కొందరు ఉద్యోగులకు పనే ఉండడం లేదు. సచివాలయ సిబ్బంది రీ గ్రూపింగ్ ఇంకా అమలులోకి రాకపోవడంతో ఎక్కడివారు అక్కడే పనిచేస్తున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాల పరిధిలోని వార్డు, గ్రామ సచివాలయాల పనితీరుపై జరిపిన పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. పట్టణాల్లోని వార్డు సచివాలయాల్లో ఉన్న అడ్మిన్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వో, వెల్ఫేర్, శానిటేషన్, హెల్త్ సెక్రటరీలపై ఎక్కువ పనిభారం పడుతోంది. ఇంజనీరింగ్ అసిస్టెంట్(ఎమినిటీస్ సెక్రటరీ), ప్లానింగ్ సెక్రటరీలపై అంతంత మాత్రంగానే పనిభారం ఉంటుండగా, మహిళా పోలీసు, ఎడ్యుకేషన్ సెక్రటరీలకు పనే ఉండట్లేదు. పట్టణాల్లో వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ అసిస్టెంట్లు లేకపోవడం లోటుగా ఉంది. పిఠాపురంలో ప్లానింగ్ సెక్రటరీలు పది మంది వివిధ ప్రాంతాల్లో డిప్యూటేషన్లపై పనిచేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లోనూ ఇదే రీతిలో పనితీరు ఉంటోంది. సచివాలయ అడ్మిన్, పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో వీరిపైనే పనిఒత్తిడి అధికంగా ఉంటోంది. అసిస్టెంట్ లైన్‌మేన్లు పేరుకే సచివాలయ ఉద్యోగులు అయినా వీరు ఏపీఈపీడీసీఎల్ అధికారుల పర్యవేక్షణ, వీఆర్వోలు తహశీల్దారు పర్యవేక్షణలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం రీసర్వే తప్పిదాలు అధికంగా ఉండడంతో సర్వేయర్లపై ఒత్తిడి ఉంటోంది. సచివాలయాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ లేక సచివాలయాల్లో సిబ్బంది నచ్చిన సమయాల్లో రావడం, నచ్చిన సమయాల్లో వెళ్లిపోతున్నారు. సామర్లకోట మండలంలో 15 వార్డు, 21 గ్రామ సచివాలయాలుండగా వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే ప్రజలు సచివాలయాల సిబ్బంది రాక కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన పంచే పింఛన్ల సొమ్ము సమయంలో మినహా మిగిలిన 24 రోజులూ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఎక్కువమంది సచివాలయ సిబ్బంది డిప్యూటేషన్ల పేరిట ఇతరత్రా విధుల్లో ఉండడం, మిగిలిన వారు తరచూ ఫీల్డ్‌వర్క్ పనుల సాకుతో బయటకు వెళ్తూ సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. దీంతో ఒక్క అడ్మిన్ అధికారి మినహా మిగిలిన వారు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. సామర్లకోట నీలమ్మచెరువు వద్ద ఉన్న సచివాలయం, పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న సచివాలయాల్లో అడ్మిన్‌లు మినహా మరే ఇతర సిబ్బంది హాజరులేక ఖాళీ కుర్చీలు సోమవారం నిర్వహించిన విజిట్‌లో దర్శనమిచ్చాయి.

ఒకరి పని మరొకరితో..

ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని తొమ్మిది సచివాలయాల్లో 90మంది ఉద్యోగులకు 70మంది మాత్రమే ఉన్నారు. రూరల్‌లో 15 సచివాలయాలకు 138మందికి కేవలం 90మంది మాత్రమే ఉన్నారు. అత్యధికంగా సచివాలయాల్లో జనన, మరణ, ధ్రువపత్రాలు. పేరు మార్పులు, చేర్పులన్నీ డిజిటల్ అసిస్టెంట్‌లే చేయాలి. వీరిపైనే అధిక భారం ఉంటోంది. వ్యవసాయ అసిస్టెంట్లు, సర్వేయర్లు లేక రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో వీటిలో పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్ నిర్వహించే పనులను మహిళా పోలీసులకు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు అప్పగిస్తున్నారు. వీరికి పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. గండేపల్లి మండలంలో 139 సచివాలయ సిబ్బంది ఉండాల్సి ఉండగా 64 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉన్న 75 మందిపై పని ఒత్తిడి అధికంగా ఉంటోంది. కోటనందూరు మండలంలోని 15 సచివాలయాల్లో 18మంది సిబ్బంది ఉన్నా చాలామంది ఉద్యోగులకు అసలు పనిలేక ఖాళీగా కూర్చుంటున్నారు.

జాబ్‌కి వస్తేగా...

పెద్దాపురం మండలంలో 21 గ్రామ, పట్టణ పరిధిలో 14 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో పంచాయతీ కార్యదర్శి డిజిటల్, వెల్ఫేర్, వీఏఏలకు పూర్తిస్థాయిలో పనిభారం ఉంటోంది. మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు పనిలేక ఖాళీగా ఉంటున్నారు. సకాలంలో విధులకు సైతం చాలామంది హాజరవడంలేదు. ప్రత్తిపాడు మండలంలోని అధిక సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు లేరు. అనేక సచివాలయాల్లో సిబ్బంది అసలు సమయ పాలన పాటించడం లేదు. శంఖవరం మండలంలో 16 సచివాలయాల్లో ఖాళీలు కలవరపెడుతున్నాయి. తొండంగి మండలంలో 26 సచివాలయాలు ఉండగా బదిలీల కారణంగా కొన్ని పోస్టులు భర్తీ కాక ఖాళీగా ఉన్నాయి. 26 మంది డిజిటల్ అసిస్టెంట్లకు 9 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ప్రజలకు సరిగ్గా సేవలందడంలేదు. మండలంలో రీ గ్రూపింగ్ ప్రక్రియ ప్రారంభం కాలేదు.

అంతా మా ఇష్టం..

కాకినాడ రూరల్ మండలంలో 41 గ్రామ సచివాలయాల్లో 321 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా 26మంది వేర్వేరు ఉద్యోగాలు రావడంతో మానేశారు. దీంతో 295 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్‌లో మండలంలో 38 పోస్టులు అధికంగా ఉన్నట్లు గుర్తించి డిప్యుటేషన్‌పై పంపించారు. డిజిటల్ అసిస్టెంట్ల పోస్టులు 4 ఖాళీగా ఉండడంతో సేవల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కరప మండలంలో 21 సచివాలయాలున్నాయి. 17 పోస్టులు ఖాళీగా ఉండగా అనేక వాటిలో సిబ్బంది ఎవరికివారే యమునా తీరే అన్నట్లుగా ఉన్నారు. కొంగోడు డిజిటల్ అసిస్టెంట్ అధికారులకు తెలపకుండా రెండు నెలలుగా విధులకు డుమ్మా కొట్టారు. సిబ్బందిలో అధికశాతం మంది కనీసం సమాచారం ఇవ్వకుండా సెలవులపై వెళ్తున్నారు. సర్వేయర్లపై మాత్రమే పనిభారం అధికంగా ఉంటోంది. గతంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది విధులకు హాజరు, విధుల నిర్వహణ, లక్ష్యాలు సాధన వంటి అంశాలపై డీఎల్డీవో అధికారి పర్యవేక్షణ ఉండేది. కానీ ఆ తర్వాత డీఎల్డీవోలకు అధికారాలు కత్తిరించడంతో సచివాలయాల సిబ్బందిలో ఇష్టారీతి పెరిగింది.

అర్హులందరికీ గృహాలు, స్థలాలు మంజూరు

- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్
- జిల్లాలో నూతన ఇళ్లు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం ద్వారా నిర్మించిన ఇళ్ల గృహప్రవేశాల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి గండి కొండలరావులతో కలిసి ఆయన బుధవారం పాల్గొన్నారు. పలువురికి గృహ మంజూరు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వంపన సూర్యచంద్రరావు, నాయకులు జ్యోతుల శ్రీనివాస్, గొల్లపల్లి గంగా ఈశ్వరుడు, ఇంటి వీరబాబు, లక్ష్మణ్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, తహసీల్దారు రామకుమార్, ఎంపీడీవో సెలట్‌రాజు, ఏఈ రాజేశ్వరీ, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో..

కాకినాడ సిటీ(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక 10, 12 డివిజన్ల పరిధిలోని పర్లోవపేట పూలేపాకలు, దుమ్ములపేట, తారకరామనగర్‌ల్లో పీఎంఏవై పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో బుధవారం వారు గృహప్రవేశాలు చేయించి నమూనాతాళం, నూతన వస్త్రాలు అందజేశారు. గృహనిర్మాణ మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్య నారాయణ, ఈఈ శ్రీనివాస్, డీఈ సత్యనారాయణరెడ్డి, ఏఈ సోమిరెడ్డి సురేష్‌కుమార్, నాయకులు తుమ్మల సునీతరమేష్, ఎరిపిల్లి రాము, మూగు రాజు, తుమ్మల కొండలరావు, చోడిపిల్లి సతీష్, మోసా పేతూరు, మాదే ఆంద్రియ్య, మోసా యేసేబు, గంపల లక్ష్మణరావు, దిబ్బాడ పోలరాజు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో లబ్ధిదారులకు తాళం, నూతన వస్త్రాలు అందజేస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం

బాలలు వారికున్న ప్రతి హక్కును పొందాలి

- ఐసీడీఎస్ పీడీ లక్ష్మి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పీడీ లక్ష్మి, ఇతర అధికారులు

కార్పొరేషన్(కాకినాడ),నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాలలు వారికున్న ప్రతి హక్కును పొందాలని, అందుకు అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం బాలలహక్కుల వారోత్సవాలు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బాలలకు వారికి ఉన్న ప్రతిహక్కును వారు పొందేలా మనం అందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా బాలల హక్కుల దినోత్సవానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీపీవో హెచ్. వెంకట్రావు, పీవో సి.శ్రీనివాస్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(కాఫ్) డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ బి.కుమారి పాల్గొన్నారు.

'తాండవ'పై తుది దశకు అక్విడెక్ట్ పనులు

- తునిలో పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల పరిశీలన



తుని వద్ద పోలవరం అక్విడెక్ట్ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

తునిరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా తుని వద్ద తాండవ నదిపై ఏర్పాటవుతున్న అక్విడెక్ట్ పనులు తుది దశకు చేరుతున్నాయి. రూ.65కోట్ల నిధులతో నిర్మాణమవుతున్న ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 450 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పు గల అక్విడెక్ట్ పనులు ఈ నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పనులను, నాణ్యతా ప్రమాణాలను పోలవరం, ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. అనంతరం కుమ్మరిలోవలో జరుగుతున్న పనులను ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ ఏసుబాబు, ఈఈ గోవింద్, డీఈ మురళీ పరిశీలించారు.

మార్మోగిన సత్యదేవ నామస్మరణ

- అన్నవరం దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో పడిపూజ
- తరలివచ్చిన అయ్యప్ప, సత్యదీక్షాపరులు

7

జాతీయ రహదారుల్లో.. ట్రామా కేర్ సెంటర్లు

- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించడానికి ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటుకు కృషి చేస్తామని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాద సమయాల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించే లక్ష్యంతో కాకినాడ పార్లమెంటు పరిధిలో జాతీయ రహదారుల వెంబడి ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా

- పట్టుకున్న జిల్లా పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- 213.28 కిలోల గంజాయి స్వాధీనం

7

పోలీస్‌శాఖ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్
- ఎంపీ నిధుల ద్వారా సమకూర్చిన టీయూవీ వాహనాలు ఎస్పీకి అందజేత



వాహనాన్ని ప్రారంభించి ఎస్పీకి అందజేస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడక్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖను బలోపేతం చేసి తద్వారా ప్రజల రక్షణకు పెద్దపీట వేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఆయన ఎంపీ నిధుల ద్వారా సమకూర్చిన రూ.36లక్షలతో 4టీయూవీ వాహనాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ జి.బిందుమాధవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వాహనాలు సమకూర్చడానికి కారణం ఏదైనా ఘటన జరిగిన వెంటనే పోలీస్ సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలాలకు చేరుకోవడంలో వీటివల్ల సౌలభ్యం కలుగుతుందన్నారు. శాంతి, భద్రతల పరిరక్షణ, నేర నిరోధక చర్యలు వేగవంతమవుతాయన్నారు. ప్రజలకు త్వరితగతిన సేవలందించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. పోలీస్ శాఖ బలోపేతానికి ఎంపీ ఉదయ్ సహకారం మరువలేనిదని ఎస్పీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాస్, కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్‌పాటిల్, ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు.

ఉపాధి కోసం..

- ఉప్పాడ నుంచి వలసబాట పట్టిన తీరప్రాంత మత్స్యకారులు
- ఇతర ప్రాంతాలకు వెళ్లిన 50 బోట్ల మత్స్యకారులు

కొత్తపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంత గ్రామాలకు చెందిన పలువురు మత్స్యకారులకు సరైన పాటు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఉప్పాడ, సుబ్బంపేట, అమీనాబాద్, మాయాపట్నం, మూలపేట, కోనపాపపేట, పొన్నాడ తదితర తీర ప్రాంతాలకు చెందిన 1000మంది మత్స్యకారులకు తమ 50బోట్లపై ఇటీవల మచిలీపట్నం, ఓడలరేవు తదితర ప్రాంతాలకు తరలివెళ్లారు.వేట నిషేధం తర్వాత సముద్రంలో పాటు లేకపోవడం, వరుస తుఫాన్‌ల కారణంగా వేటలకు అంతరాయం ఏర్పడడం, ప్రస్తుతకాలంలో సముద్రంలో మత్స్యసంపద లభ్యం కాకపోవడం వంటి కారణాలతో రెండునెలల కాలానికి వేరే ప్రాంతంలో వేటాడేందుకు వలస వెళ్తున్నామని మత్స్యకారులు చెప్తున్నారు. ఉప్పాడ తీరంలో ఎంత దూరం వెళ్లినా డీజిల్ ఖర్చు తప్ప కనీస ఖర్చులకు సైతం చేపలు దొరకడం లేదని వారు వాపోతున్నారు. ప్రతిఏటా వీరు మచిలీపట్నం, ఓడలరేవు, బందరు వంటి ప్రాంతాల్లో రెండు, మూడు నెలల కాలానికి వలస వెళ్లి వస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో కనీసం ఖర్చులు పోను కుటుంబపోషణకు ఎంతో కొంత ఆదాయం సంపాదించుకోవచ్చునన్న ఆశతో వేరే ప్రాంతాలకు వలసవెళ్లడం తప్పడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. తీరంలో నెలకొల్పిన రసాయన పరిశ్రమల కారణంగా వాటివల్ల విడుదలయ్యే వ్యర్థ కాలుష్యాల వల్ల సముద్రంలో మత్స్యసంపద క్రమేపీ అంతరించిపోతోందని వారు తెలిపారు. రసాయన పరిశ్రమల కారణంగా తీర ప్రాంత మత్స్యకారులకు జీవనోపాధి పూర్తిగా ఆటంకం ఏర్పడిందని వారు ఆవేదన చెందుతున్నారు. కాలుష్య పరిశ్రమల కారణంగా తమ జీవనోపాధి నష్టం కలుగుతుందని, సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చర్యలు చేపడతారన్న నమ్మకంతో తామంతా ఎదురు చూస్తున్నామని తీరప్రాంత మత్స్యకారులు కోరుతున్నారు. ఆయన త్వరితగతిన తమ సమస్యలను పరిష్కరిస్తే తాము వేరే ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని వారు తమ అభిప్రాయాలను తెలియజేశారు.



పోల్ వాల్ట్‌లో మేటి క్రీడాకారుడు రవి

విద్యార్థి దశ నుంచే ఆటలపై మక్కువ. అతడిలో ఉన్న నైపుణ్యాన్ని కోచ్ గమనించి శిక్షణ ఇచ్చి పోల్‌వాల్ట్ బరిలో దింపాడు. అరకొరగా ఉన్న సౌకర్యాలను వినియోగించుకుంటూనే జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. పోల్‌వాల్ట్ బరిలో అతను అడుగుపెడితే పతకం ఖాయమనే పేరు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి మరింత ఉన్నత స్థాయి శిక్షణ ఇస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధిండం తన లక్ష్యమని చెప్తున్నాడు.



- పోల్‌వాల్ట్‌లో సత్తా చాటుతున్న పిఠాపురం క్రీడాకారుడు సాలా రవి
- విద్యార్థి దశ నుంచే పతకాల వేట
- ఇప్పటికే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో 20 స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం
- సౌకర్యాలు కల్పిస్తే అంతర్జాతీయ పోటీల్లోనూ పతకాలు సాధిస్తానని ధీమా

అడుగు పెడితే పతకమే



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన సాలా రవి పోల్‌వాల్ట్ క్రీడలో రాణిస్తూ పతకాలు పంట పండిస్తున్నాడు. ఇతడికి చిన్ననాటి నుంచే క్రీడలపై మక్కువ అధికం. ఆ సమయంలో చదువుకునే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎలిపే సునీల్‌దేశాయి ఇతనిలో ప్రతిభను గుర్తించి పోల్‌వాల్ట్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో లేకపోయినా కోచ్ సమకూర్చిన వాటితోనే శిక్షణ పొంది నగరాల్లో అత్యాధునిక క్రీడా మైదానాల్లో శిక్షణ పొందిన వారితో పోటీ పడి పతకాలు సాధించడం ప్రారంభించాడు. ఇతని పేరు ఎంత ఎలా మారుమోగింది అంటే రవి పోల్‌వాల్ట్ బరిలో దిగితే పతకం ఖాయమని ముందే చెప్పే వరకూ. ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఒక వైపు ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూనే పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుతున్నాడు.

బరిలో దిగిన నాటి నుంచీ...

ఉన్నత పాఠశాల స్థాయిలో బరిలో దిగిన నాటి నుంచీ రవి పోల్‌వాల్ట్‌లో తన ప్రతిభ చాటుకుంటూనే వస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఇప్పటిదాకా 15 స్వర్ణ, 2 రజత, 3 కాంస్య పతకాలు సాధించాడు. అండర్-18, అండర్-20, అండర్-23, యూనివర్సిటీ, అంతర్ యూనివర్సిటీల కేటగిరీల్లో ఏ పోటీ జరిగినా విజేత ఇతడే. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, గుంటూరు నాగార్జున యూనివర్సిటీ, అమలాపురంల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోను, జార్ఖండ్, తమిళనాడు, కేరళ, తెలంగాణలోని కరీంనగర్, ఏపీలోని గుంటూరు నాగార్జున యూనివర్సిటీల్లో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్-పోల్‌వాల్ట్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. ఆంధ్రప్రదేశ్ తరఫున జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు.




రవిని అభినందిస్తున్న విశ్రాంత అడిషనల్ ఎస్పీ అరిటాకుల శ్రీనివాసరావు, గుంటూరులో జరిగిన అంతర్ యూనివర్శిటీ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన రవి (పాత చిత్రాలు)

ఉద్యోగ వేటలో: పోల్‌వాల్ట్ క్రీడలో 20 పతకాలు సాధించిన క్రీడాకారుడు సాలా రవి ప్రస్తుతం ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. చదువు పూర్తి కావడంతో ఏదైనా ప్రభుత్వరంగ సంస్థ లేదా రాష్ట్ర ప్రభుత్వం తన ప్రతిభను గుర్తించి ఉద్యోగ అవకాశం కల్పిస్తుందనే ఆశతో ఉన్నాడు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా కోచ్ ఎలిపే సునీల్‌దేశాయి ప్రోత్సాహంతో ఇప్పటికీ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నాడు. ఇదే సమయంలో నగరాల్లో ఉన్న పోల్‌వాల్ట్ అత్యాధునిక సౌకర్యాలను పిఠాపురంలో కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధిస్తానని ధీమాగా చెప్తున్నాడు రవి. ఇతడి ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ఉద్యోగావకాశం కల్పిస్తే పలువురు క్రీడాకారులకు స్ఫూర్తిగా ఉంటుందని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.



ప్రభుత్వం అండగా నిలిస్తే పతకాల పంట పండిస్తాం

ఎలిపే సునీల్ దేశాయి, వ్యాయామ ఉపాధ్యాయుడు, కోచ్, పిఠాపురం

ప్రభుత్వం అండగా నిలిచి పోల్‌వాల్ట్ సహా అన్ని క్రీడలకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తే మన క్రీడాకారులు పతకాల పంట పండిస్తారు. పిఠాపురం నుంచి ఎంతోమంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారు. పోల్‌వాల్ట్‌లో సాలా రవి మంచి ప్రతిభ కనబరుస్తున్నాడు. ఉన్న సౌకర్యాలతోనే అతడికి శిక్షణ ఇచ్చి, ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీ పడేలా తీర్చిదిద్దాము. ఇలాంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక కోటా కింద ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే బాగుంటుంది. ఇలాంటి వారిని చూసి మరింత మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా తయారవుతారు.

అందరూ ఆడుతుంటే ఆసక్తి కలిగింది

సాలా రవి, పోల్‌వాల్ట్ క్రీడాకారుడు, పిఠాపురం



పాఠశాలల్లో చదువుకునే సమయంలో మా సీనియర్లకు మా వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్‌దేశాయి శిక్షణ ఇవ్వడం చూశాను. నాకూ పోల్‌వాల్ట్‌పై ఆసక్తి కలిగింది. ఇతర క్రీడల్లో ప్రావీణ్యం ఉన్నా పారే పోల్ వాల్ట్‌లో కోచ్ సునీల్‌దేశాయి ప్రోత్సహించి శిక్షణ ఇచ్చారు. దీంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటగలిగాను. ఉన్న సౌకర్యాలతోనే 20 పతకాలు సాధించాను. ఇక్కడ పూర్తిస్థాయిలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఉంది.



ఏజెన్సీలో సాగవుతున్న నల్ల ధాన్యం పంట

నల్ల బియ్యం.... ఆరోగ్యకరం

'తూర్పు' మన్యంలో విస్తరిస్తున్న సాగు

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

సాగుకు పెట్టుబడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆ వ్యయాన్ని రాబట్టుకోవడానికి అధిక దిగుబడులు వైపు అడుగులు వేస్తున్నారు. ఇందుకు రసాయనాలు వినియోగించాల్సి రావడం... అవి తిన్నవారు వ్యాధుల బారిన పడి చివరకు ఆసుపత్రులపాలవుతుండడం చూస్తున్నాం. కాగా ఇటీవల పల్లెలు మొదలుకొని పట్టణాల వరకు సేంద్రియ పంటల వినియోగం వైపు మొగ్గుచూపుతున్నారు. ఆ మేరకు అందుబాటులో వున్న రైతుల వద్ద నేరుగా ఆయా పంటలను కొనుగోలు చేయలేని పక్షంలో ఆన్‌లైన్‌లను ఆశ్రయిస్తున్నారు. సాధారణ సాగు పంటలతో పోల్చితే సేంద్రియ పంటల ధరలు ఎక్కువగా ఉండడం, డిమాండ్ కూడా పెరుగుతుండడంతో రైతులు కూడా సేంద్రియ సాగువైపు ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా నల్ల బియ్యం, బ్రౌన్‌రైస్, దంపుడు బియ్యం విక్రయాలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. వాటి ధరలు కూడా అధికంగా ఉన్నప్పటికీ వినియోగ శాతం రోజురోజుకూ పెరుగుతూ వస్తోందని విక్రయదారులు చెప్తున్నారు.

ఇదిలా వుండగా అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని చట్టి, వీరాపురం, ఎటపాక మండలంలోని కేఎస్ పురంలో ఈ ఏడాది కొద్దిమంది రైతులు నల్ల ధాన్యం (బియ్యం) సాగు చేస్తున్నారు. చట్టికి చెందిన రవ్వ అంజి, గౌరి, సీతారామయ్య తదితరులు నల్ల ధాన్యాన్ని పండించి సొంతంగా వినియోగించుకుంటున్నారు. ఈ బియ్యం తినడం ద్వారా ఆరోగ్యం కూడా మెరుగుపడుతోందని వారు చెప్తున్నారు. కాగా పంట ఏపుగా పెరగడంతో గాలికి కిందకు పడిపోతోందని, సాధారణ వరి కంటే దిగుబడి తక్కువగా ఉంటోందన్నారు. మార్కెట్లో నల్ల బియ్యం ధర కిలో రూ.200 వరకు ఉంది. నల్ల ధాన్యం వంగడాలను ఆసక్తి గల రైతులకు అందిస్తున్నామని అంజి చెప్పారు.






నల్ల ధాన్యం పండిస్తున్న గౌరి, అంజి

హిందీలో చేతిరాత బైబిల్ ఆవిష్కరణ



రచయిత శాంతకుమారిని అభినందిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి

- కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి దుర్గేష్, మాజీ ఎంపీ ఉండవల్లి
- రచయిత శాంతకుమారికి అభినందన

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలుగు, ఆంగ్ల భాషల్లో బైబిల్‌ని చేతిరాతతో పూర్తిచేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి తాజాగా హిందీలో కూడా చేతిరాతతో బైబిల్‌ను పూర్తిచేయడం అభినందనీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక లూథర్ గిరి క్రైస్ట్ చర్చిలో బుధవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆయన విచ్చేసి సదరు బైబిల్‌ను ఆవిష్కరించారు. పేపర్ మిల్ ఐఎన్‌టీయూసీ నేతగా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా సుపరిచితుడైన బయ్యా జోసెఫ్ రాజు పుట్టినరోజు సందర్భంగా ఆయన సతీమణి శాంతకుమారి రాసిన హిందీ వెర్షన్ చేతిరాత బైబిల్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. మరో ముఖ్య అతిథిగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జోషి అజాత శత్రువని, ఉండవల్లి, జక్కంపూడి, జోషి కాంబినేషన్‌లో రాజకీయాలు అద్భుతంగా నడిచాయన్నారు. పేపర్‌మిల్ ఉన్నంతకాలం జోషి పేరు వినిపిస్తుందన్నారు.మూడు భాషల్లో బైబిల్‌ని చేతిరాతతో పూర్తిచేయడం ఎక్కడా లేదని,దీనిపై గిన్నీస్ బుక్ రికార్డు కోసం దరఖాస్తు చేయాలని అందుకు అవసరమైన సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, జక్కంపూడి విజయలక్ష్మి , సహస్ర, కోలమూరు ప్రభాకరరావు, రెవ జి.విలియమ్స్, డేవిడ్‌కుమార్, ప్రార్ధనాకుమార్, శ్రీకాంత్ జేమ్స్, పెర్సి హేరామ్స్, నెల్సన్ ఫ్రాన్సిస్, చక్రవర్తి, ఆనంద్‌కుమార్, డానియల్ బి.రవి, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, పంతం కొండలరావు, టీకే విశ్వేశ్వరరెడ్డి, అశోక్‌కుమార్ జైన్, నక్కా రాజబాబు పాల్గొన్నారు.

18 ఏళ్ల లెలావాయి రైతుల నిరీక్షణకు ఫలితం

ఎట్టకేలకు పోలవరం నిర్వాసిత రైతులకు వడ్డీతో సహా బ్యాంకు ఖాతాలో జమ

కూనవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లెలావాయి ప్రాంతంలోని భూములున్న పోలవరం నిర్వాసిత రైతుల నిరీక్షణ 18 ఏళ్ల తర్వాత ఫలించింది. వాస్తవానికి ఈ ప్రాంతంలోని భూములకు ఉమ్మడి రాష్ట్రంలో 2007లోనే పరిహారం రావాల్సి ఉంది. అప్పట్లో సీపీఎం పార్టీ పోలవరం ప్రాజెక్టు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు చేపట్టింది.ఈ ప్రాంతంలో భూముల సర్వేకు వచ్చిన అధికారులను సీపీఎం నాయకులు గదుల్లో వేసి నిర్బంధించేవారు. అప్పటి నుంచి ఈ భూముల సర్వే నిలిచిపోయింది. మళ్లీ రెండేళ్ల క్రితం సర్వే నిర్వహించి అవార్డు ఎంక్వైయిరీ నిర్వహించినప్పటికీ జగన్ ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వలేదు. అయితే కూటమి అధికారంలోకి రాగానే ఈ భూములకు వడ్డీతో సహా బుధవారం రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. వాస్తవానికి పోలవరం ప్రాజెక్టు కారణంగా భూములకు ఎకరానికి రూ.10.80 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ వడ్డీతో సహా రూ.1,47,178 కలిపి రూ.12,27,178 ఒక ఎకరానికి చెల్లించింది.ఈ లెలావాయి భూముల్లో కూనవరం, టేకులబోరు, భీమవరం గ్రామాలకు చెందిన 46మంది రైతులు ఉండగా 128 ఎకరాల 90 సెంట్లు భూమి ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు మాత్రం ఐఎఫ్‌సీ కోడ్ మారిపోవడంతో వారి బ్యాంకుల్లో డబ్బులు కావడానికి కొంత ఆలస్యం అవుతుంది. చాలా సంవత్సరాల తర్వాత పరిహారం రావడంతో నిర్వాసితులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆర్ఎంసీ ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఉద్యోగోన్నతి

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ)లో ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు ప్రొఫెసర్ హోదా కల్పిస్తూ ఆర్ఎంసీ ఈఎన్‌టీ విభాగంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులో నియమించింది. స్పౌజ్, పరిపాలనా కోణంలో ఉద్యోగోన్నతి ఇచ్చినట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జీవోఆర్‌టీ నెం.787లో పేర్కొంది.

దశ తిరిగినట్టే!

- కాకినాడలో ఏఎంజీ మెటల్ కంపెనీ భారీ పెట్టుబడి
- రూ.44వేల కోట్లతో అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్
- కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులోని సూర్యారావుపేటలో నిర్మాణం
- పలు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు


(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడకు మరో భారీ పెట్టుబడి వచ్చింది. ఏకంగా రూ.44 వేల కోట్లతో ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు నిర్ణయించింది. కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులోని పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని సూర్యారావుపేటలో ఈ కంపెనీ ఏర్పాటుకానుంది. ఈ మేరకు భారీ పెట్టుబడితో ముందుకు వచ్చిన ఈ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామిక ప్రోత్సాహకాలు ప్రకటించాలని నిర్ణయించింది. ఈమేరకు పరిశ్రమల శాఖ బుధవారం జీవో ఎంఎస్ నెంబరు 201 పేరుతో ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో సూర్యారావుపేటలో స్పెక్ట్రమ్ పవర్ ప్లాంట్ ఉండేది. ఆ తర్వాత దాన్ని విక్రయించేసింది. ఇప్పుడు అందులో ఈ కొత్త పరిశ్రమ రాబోతోంది. ఈ కంపెనీ 800 ఎకరాల్లో స్థాపించి ఏడాదికి ఒక మిలియన్ టన్ను అల్యూమినియం స్మెల్టర్‌ను పూర్తి పర్యావరణ హిత విద్యుత్ ఉపయోగించి ఉత్పత్తి చేయనుంది. ఈ కంపెనీకి తెరవెనుక పూర్తి సహాయ సహకారాలను నెదర్లాండ్స్‌లో ఏర్పాటు చేసిన ఏఎం గ్రీన్ అందించనుంది. కంపెనీ స్థాపనలో భాగంగా ఏఎంజీ సంస్థ భూమి,భూ అభివృద్ధికి రెండు దశల్లో రూ.1800 కోట్లు, భవనాలు, ఇతర సివిల్ పనులకు రెండు దశల్లో రూ.2,950 కోట్లు, ప్లాంట్, ఇతర యంత్రాలకు రెండు దశల్లో రూ.30,300 కోట్లు, ఇంకా ఇతర ఖర్చులు కలిపి మొత్తం తొలిదశ కింద రూ.24,250 కోట్లు, రెండో దశ కింద రూ.19,750 కోట్లు కలిపి మొత్తం రూ.44 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వానికి వివరించింది. తొలి దశలో 0.5 మిలియన్ టన్నులు, రెండో దశలో 0.5 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయనుంది. తద్వారా మొత్తం 3వేల మందికి ఉపాధి కల్పించనున్నట్టు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది. ఈ మేరకు పెట్టుబడుల ప్రతిపాదన వివరాలను ఈ సంస్థ ఈ నెల 7న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) ఎదుట ఉంచింది.ఈ నేపథ్యంలో ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు ఈ సంస్థకు సూర్యారావుపేటలో 250 ఎకరాల భూ కేటాయింపునకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే కంపెనీ ఉత్పత్తికి సహకరించడంలో భాగంగా గ్రీన్ కారిడార్ విధానంలో 2,500 మెగావాట్ల విద్యుత్, నీటి అవసరాలు తీర్చే విధంగా 17.2ఎంఎల్‌డీ నీటి సరఫరా చేయనుంది. అలాగే భారీ పరిశ్రమ కేటగిరీలో ఈ కంపెనీని చేర్చి అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అన్నిరకాల అనుమతులు వేగంగా జారీ చేయడం, అలాగే వాటర్ ఫ్రంట్ యాక్సెస్ కింద మల్టీపర్పస్ బార్జి డాక్ నిర్వహణకు అనుమతులు జారీ చేసింది. అంటే ఈ కంపెనీ ఎదురుగా ఉన్న ఉప్పాడ సముద్రం వద్ద ప్రత్యేక బెర్త్ నిర్మించి నేరుగా విదేశాల నుంచి కావలసిన పరికరాలు, యంత్రాలు, ఇతర ఉత్పత్తులు నౌకల్లో తీసుకురానుంది. అలాగే కంపెనీ రెండు దశల్లో పెట్టనున్న రూ.37,150 కోట్ల ఫిక్స్‌డ్ క్యాపిటల్ పెట్టుబడికి సంబంధించి ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ పది సంవత్సరాల పాటు 15శాతం, విద్యుత్ సుంకం నూరు శాతం పాతిక సంవత్సరాల పాటు మినహాయింపు, కారుచౌక ధరకు 25ఏళ్లపాటు నీటి సరఫరా, స్టాంపు డ్యూటీ, భూమార్పిడి, రిజిస్ట్రేషన్ ఫీజులు నూరు శాతం(250ఎకరాల భూ కొనుగోలుపై రూ.28 కోట్లకు మించకుండా) మినహాయింపు ఇస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏం ఉత్పత్తి చేస్తారు..?

అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్ అంటే అల్యూమినియం ఆక్సైడ్ నుంచి విద్యుద్విశ్లేషణ ప్రక్రియ ద్వారా అల్యూమినియాన్ని వెలికితీసే ప్లాంట్. ఈ ప్రక్రియ కోసం ప్లాంట్‌కు భారీగా విద్యుత్ అవసరం. దీన్ని గ్రీన్ ఎనర్జీ కింద చలమశెట్టి అనిల్ కంపెనీ అయిన ఏఎం గ్రీన్ అందిస్తుంది. ఈ ప్లాంట్‌కు బాక్సైట్ ఖనిజం నుంచి తీసిన అల్యూమినియాన్ని ముడి పదార్థంగా ఉపయోగిస్తారు. ఈప్లాంట్ ద్వారా ఉత్ప త్తయ్యే వస్తువులు ఉక్కు, రాగి, జింక్, సీసంకు ప్రత్యామ్నాయంగా వాడతారు. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తయ్యే అల్యూమినియాన్ని ఇం గోట్స్ రూపంలో పోస్తారు. దీన్ని కరిగించి బిల్లెట్స్, వైర్‌రాడ్‌లు, అల్యూమినియం షీట్లు, కాయిల్స్ వంటివి తయారు చేస్తారు.

జాతీయ స్క్వాష్ పోటీలకు పిఠాపురం విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈవో

పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడలో జరిగిన అంతర జిల్లాల స్క్వాష్ పోటీల్లో ఇంటర్ బైపీసీ సెకండియర్ విద్యార్థిని బూర వెన్నెల, ఎంపీసీ ఫస్టియర్ విద్యార్థిని మందేపల్లి తేజస్విని, 8వ తరగతి విద్యార్థిని గుత్తుల మహాలక్ష్మిలు ప్రతిభ చూపగా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగాల్లో జనవరి 3నుంచి 8వ తేది వరకూ డిల్లీలో, అండర్-19 విభాగానికి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో డిసెంబరు 8, 9వ తేదీల్లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. జాతీయ పోటీలకు ఎంపికైన బాలికలను, వ్యాయామ ఉపాధ్యాయులు కె.మంగాయమ్మ, వీపీఎస్ శేషుకుమారి, డి.సత్యప్రియలను డీవైఈవో సత్యనారాయణ,ఎంఈవోలు శ్యాంబాబు, నారాయణదాసు, విద్యాకమిటీ చైర్మన్ విజయలక్ష్మి తదితరులు అభినందించారు.

శైవ క్షేత్రాలు దర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



గురమంద జలపాతం వద్ద ట్రైనీ ఐఏఎస్‌లు



వై.రామవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాలు పర్యటించేందుకు వచ్చిన 12 మంది ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ ఎస్‌ల బృందం బుధవారం మూడోరోజు మండలంలోని శైవ క్షేత్రాలను దర్శించుకుంది. గిరిజనుల జీవన విధానం, అలవాట్లు, మౌలిక వసతులు కల్పన తదితర అంశాలపై అధ్యయనం చేయడంతో పాటు కార్తీక మాసం సందర్భంగా అటవీ ప్రాంతంలో ఉన్న గురమంద విశ్వనాథస్వామి,పూతి గుంట శివాలయాలు సందర్శించారు. ప్రకృతి జలపాతాల్లో సందడి చేశారు. వారి వెంట ఎంపీడీవో బాపన్న దొర, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నన్నయ ఫాస్టెస్ట్ మహిళగా విహారిక



నాగవిహారికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

కాకినాడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం(అక్నూ) అథ్లెటిక్ పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.నాగవిహారిక ప్రతిభ కనబరిచింది. 100, 200 మీటర్ల పరుగు పోటీల్లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిందని పీఆర్వో జయదేవ్ తెలిపారు. అక్నూ పరిధిలోని పరుగు పోటీల్లో అత్యంత తక్కువ సమయంలో ఈవెంట్‌ను పూర్తిచేసిన మహిళగా నమోదు కావడంతో యూనివర్శిటీ స్థాయిలో ఫాస్టెస్ట్ మహిళగా నిలిచిందన్నారు. జనవరి 12న బెంగళూరులో జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ అథ్లెటిక్ పోటీల్లో అక్నూ తరఫున పాల్గొంటుందని తెలిపారు. నాగవిహారికను ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు, పీడీలు వర్మ, రమణ, దుర్గారావు, వెంకటేశ్వరరావు అభినందించారు.

హెచ్ఎం నిర్మలకుమారికి బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నిర్మల కుమారి

కాకినాడ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కాకినాడలోని జగన్నాథపురం సెయింట్ ఆన్స్ హైస్కూల్ హెచ్ఎం నిర్మల కుమారి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూఖ్ నుంచి బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. ముస్లిం ఉపాధ్యాయులతో పాటు పది మంది క్రైస్తవ ఉపాధ్యాయులను, పది మంది క్రైస్తవ విద్యార్థులను అవార్డులకు ఎంపిక చేయడం పట్ల టీడీపీ క్రైస్తవ విభాగం రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ మోసిగంటి జోసెఫ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి వేలాడొద్దు!



ఆర్టీసీ బస్సుకు వేలాడుతూ ప్రమాదమని తెలిసినా విద్యార్థులు అలానే ప్రయాణిస్తున్నారు. కళాశాలలుకు విద్యార్థులు వెళ్లే ఉదయం, సాయంత్రం సమయాల్లో సరిపడా బస్సులు లేకపోవడం, కళాశాలలుకు సకాలంలో వెళ్లాలనే ఆతృతతో డోర్ వద్ద వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఉప్పాడ బస్టాండు వద్ద బుధవారం ఉదయం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. (పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

సూర్యుడిలో చంద్రుడు!



ఇక్కడ మబ్బుల్లో కనిపిస్తున్నది చంద్రుడు కాదు సూర్యుడు. చంద్రుడి మాదిరిగా మబ్బుల్లో నుంచి కనిపించిన సూర్యుడిని పలువురు కనులారా వీక్షించారు. కాకినాడ జిల్లా పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల జాతీయ రహదారిపై నుంచి ఆకాశంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా దుర్ఘటన

- ఆటోను ఢీకొన్న లారీ
- ఆటో డ్రైవర్ మృతి... ఐదుగురు మహిళలకు తీవ్రగాయాలు
- ప్రత్తిపాడు హైవేపై ఘటన



సంఘటనా స్థలంలో ఆటో



మరణించిన ఆటో డ్రైవర్ ఆదివిష్ణు

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై బుధవారం ఆటోను గుర్తు తెలియని లారీ ఢీ కొన్న దుర్ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందగా ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం కిర్లంపూడి మండలం ముక్కోలు గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు ఆటోలో ఇర్రిపాకలోని శివాలయానికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగివస్తున్నారు. ప్రత్తిపాడు గోవిందపురం కొండ జంక్షన్ వద్ద ఆటో ప్రత్తిపాడు గ్రామంలోకి మలుపు తిరిగేందుకు రహదారిపై వేచి ఉండగా వెనుక నుంచి రాజమండ్రి నుంచి అన్నవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ వేగంగా ఢీకొంది. ఆటో డ్రైవర్ ఆర్.రాము ఆదివిష్ణు (54) తీవ్ర గాయాల పాలై మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న దొడ్డా వీరలక్ష్మి, కామిరెడ్డి గనిలక్ష్మి, కోలం సరోజిని, ఉమ్మిడి సీతామహాలక్ష్మి, వానిరెడ్డి సత్య తీవ్రంగా యపడ్డారు. మహిళలకు స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స జరిపి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. ఆదివిష్ణు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అపీల కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కాలభైరవ స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

– ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

మార్మోగిన సత్యదేవ నామస్మరణ

- అన్నవరం దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో పడిపూజా కార్యక్రమం
- తరలివచ్చిన సత్యదీక్షా పరులు





పడిపూజ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి ప్రాంగణం బుధవారం రాత్రి సత్యదేవ నామస్మరణతో మార్మోగింది. జిల్లా నలుమాలల నుంచి వేలాదిగా తరలివచ్చిన దీక్షాపరులతో ఆలయ ప్రాంగణం పసుపుమయంగా మారింది. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజా కార్యక్రమాన్ని దీక్షాపరులంతా భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వార్షిక కల్యాణవేదిక వేదికపై అరటిడొప్పలతో అలంకరించిన వివిధ మండపాల్లో ప్రధానంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కుడివైపున క్షేత్రపాలకులు సీతారాములు, గణపతి, ఎడమభాగంలో పార్వతీ,పరమేశ్వరుల విగ్రహాలను ఉంచి అర్చక స్వాములు పడిపూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా గణపతిపూజ నిర్వహించారు. అనంతరం మారేడు, జమ్మి, తులసి తదితర దళాలతో దీక్షాపరులు తమ ముందున్న మండపంలో అర్చకస్వాములు సత్యదేవుడి అష్టోత్తర సహస్రనామాలు పఠించంగా మంత్రాలకుణుగుణంగా దీక్షాపరులు పూజలు గావించారు. భక్తిపాటలను దీక్షాపరులు ఆలపించారు. సుమారు 3వేలమంది అయ్యప్పస్వాములు, దీక్షాపరులు పాల్గొన్నారు. ఏ ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ ఏర్పాట్లు చేశారు. దీక్షాపరులందరికీ అల్పాహారాన్ని దేవస్థానం అందించింది.

నేడు సత్యదీక్షల విరమణ

అత్యంత నియమనిష్టలతో 27 రోజులు, 18 రోజులు, 9రోజుల సత్యదీక్షలు స్వీకరించిన సత్యదీక్షాపరులు గురువారం సత్యదీక్షలు విరమింపచేయనున్నారు. దూరప్రాంతాల నుంచి విచ్చేసిన కొందరు దీక్షాపరులు ఇరుముడులతో బుధవారం రాత్రికి ఆలయ ప్రాంగణానికి చేరుకోగా మరికొందరు వేకువజామున శిరస్సున ఇరుముడి ధ రించి విచ్చేశారు. సత్యదీక్షాపరుల ఇరుముడులు పురస్కరించుకుని వార్షిక కల్యాణవేదిక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీక్షావిరమణ అనంతరం వారందరికీ ఉచిత సామూహిక సత్యదేవుడి వ్రతాలను నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా

పట్టుకున్న కాకినాడ జిల్లా పోలీసులు

ఇద్దరు నిందితుల అరెస్ట్

213.28 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయితో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పోలీసు అధికారులు

కాకినాడ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను కాకినాడ జిల్లా పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.16,71,400 విలువైన 213.28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. లేలాండ్ గూడ్స్ వాహనం, స్మార్ట్ ఫోన్‌ను సీజ్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎన్‌హెచ్- 16 హైవేపై గంజాయి రవాణా జరుగుతుందని ఎస్పీకి వచ్చిన పక్కా సమాచారంతో ఆయన ఆదేశాల మెరకు పెద్దాపురం ఎస్ డీపీవో శ్రీహరిరాజు పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ వైఆ ర్‌కె శ్రీనివాస్ తన బృందంతో రామవరం, రంగవల్లి నగర్ వద్ద వాహన తనిఖీలు చేప ట్టారు. విశాఖపట్నం వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న అశోక్ లీలాండ్ గూడ్స్ వాహనాన్ని ఆపి పారిపోతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సరుకు, వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజాఫర్నగర్ జిల్లా కటౌలి మండలం ఖోకాని గ్రామానికి చెందిన 36 ఏళ్ల మహ్మద్ షాహిద్, అదే ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల రోహిత్ శర్మగా గుర్తించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ టి.రఘునందనరావు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చోరీ కేసులో 624 గ్రాముల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

కాకినాడ క్రైం: ఓ దాబా వద్ద ఆగి ఉన్న బస్సులో ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌ను తెరచి అందులోని సుమారు రూ.60 లక్షల విలువైన 624 గ్రాముల బంగారాన్ని అగంతుకులు ఈ ఏడాది సెప్టెంబరు 10న తస్కరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ కేసు నమోదు చేసి 3 బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గండేపల్లి మండలంలో ముగ్గురు అనుమానాస్పదంగా సంచరిస్తుండడాన్ని గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా విజయనగరానికి చెందిన పాతనేరస్తులు టి.నరసింహ, పి.తేజ, మహేందర్‌గా గుర్తించారు. వారు చేసిన నేరాన్ని అంగీకరించినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.60 లక్షల విలువైన 5 జతల బంగారు గాజులు, 44 జతలు చెవిలీలు మెత్తం 624 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఎస్‌బీ డీఎస్పీ కెవి సత్యనారాయణ, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో

ఉమ్మడి జిల్లా జట్టుకు స్వర్ణ పతకం



స్వర్ణ పతకం సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ హరీష్‌బాలయోగి

అమలాపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకం సాధించిందని అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు తెలిపారు. రాష్ట్రస్థాయిలో మన జిల్లాకు తొలిసారిగా స్వర్ణ పతకం సపక్‌తక్రా కీడలో లభించిందన్నారు. ప్రథమస్థానం సాధించిన క్రీడాకారుల బృందంతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం క్యాంపు కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్‌బాలయోగిని కలుసుకున్నారు. సత్తాచాటిన బాల క్రీడాకారులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించి జాతీయస్థాయిలోను రాణించే విధంగా శిక్షణ పొందాలని సూచించారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలు అమలాపురం కేంద్రంగా నిర్వహించేందుకు ప్రణాళికలు తయారుచేసి ఇవ్వాలని సీనియర్ కోచ్ యాంద్ర గౌతమ్‌కు సూచించారు. క్రీడాకారులతో పాటు శిక్షణ ఇచ్చిన కోచ్ కేతా సతీష్, ఫిజికల్ డైరెక్టర్ బూల చిరంజీవి, టీమ్ మేనేజర్ జీవీ బాబులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, పేరూరి వెంకటేశ్వరరావు, అప్పారి మోహనరావు పాల్గొన్నారు.

బాలింత మృతి వ్యవహారంలో వైద్యురాలిపై చర్యలు

డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు

పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలింత మృతి వ్యవహారంలో వైద్యురాలి(గైనకాలజిస్టు)పై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఆమెను కాకినాడ జిల్లా పిఠాపురం ఆసుపత్రి నుంచి రిలీవ్ చేసి తూర్పుగోదావరి జిల్లాలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యాలయానికి అటాచ్‌చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అసలేం జరిగిందంటే..?

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ అక్టోబరు 13న పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(ప్రభుత్వాసుపత్రి)లో చేరి 14న బిడ్డను ప్రసవించింది. అనంతరం అధిక రక్తస్రావమై సీరియస్ కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా శ్రీదుర్గ అక్కడ మరణించగా బిడ్డ అనారోగ్యానికి గురైంది. దీనిపై మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. హైరిస్క్ కేస్ అని తెలిసినా చికిత్స, డెలివరీ సమయంలో ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ పి.సుజాత నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, గైనిక్ హెచ్‌వోడి డాక్టర్ అనురాగమయి, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్యం, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, జీజీహెచ్ ఏవో శేషేంద్రశర్మ పిఠాపురంలో విచారణ నిర్వహించారు. మృతురాలి బంధువులు, చికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది.. ఆ రోజు విధుల్లో ఉన్న పారా మెడికల్ స్టాఫ్ నుంచి వివరాలు సేకరించారు. మృతురాలి కేస్ షీటు, బిడ్డ ఆరోగ్యం తదితర అంశాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు నివేదిక సమర్పించారు. నివేదిక ఆధారంగా దొండపాటి శ్రీదుర్గకు వైద్యం చేసిన గైనకాలజిస్టు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతను తక్షణం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి ఏటాచ్ చేయాలని కలెక్టర్ సూచించారు. దీంతో ఆమెను పిఠాపురం సీహెచ్‌సీ నుంచి రిలీవ్ చేసి డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉమ్మడి జిల్లా ఆసుపత్రి సేవల కోఆర్డినేటర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సుజాతను డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి ఎటాచ్ చేసిన నేపథ్యంలో వైద్యసేవలకు ఇబ్బంది లేకుండా సామర్లకోట ప్రభుత్వాసుత్రి నుంచి డాక్టర్ కన్యాకుమారిని పిఠాపురం సీహెచ్‌సీ నుంచి డిప్యూటేషన్‌పై నియమించారు. ఆమె విధులకు హాజరయ్యారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన శివకృష్ణ

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. చింతూరు ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం దుమ్ముగూడెం మండలం చెరుపల్లికి చెందిన శివకృష్ణతో పాటు మరో ఇద్దరు ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి చింతూరు - విజయవాడ జాతీయ రహదారి నంబరు 31 మీదుగా భద్రాచలం వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో అల్లూరి జిల్లా చింతూరు మండ లం తుమ్మల సమీపంలో అటుగా కాలినడకన వెళ్తున్న వ్యక్తిని శివకృష్ణ ద్విచక్ర వాహనంతో ఢీ కొన్నాడు. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న శివకృష్ణ (31) తలకు తీవ్రంగా గాయమై మృతి చెందాడు. ఇక కాలినడకన వెళ్తున్న వ్యక్తితో సహా వాహనంపై వెళ్తున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారి పరిస్థితి నిలకడగా ఉందని, కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



వెంకటరమణ (ఫైల్)

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి ప్రాంతానికి చెందిన దేవగుప్తాపు వెంకటరమణ (52) బుధవారం మరోవ్యక్తి కలిసి మోటారుసైకిల్‌పై పోలవరం వైపు వెళ్తున్నారు. వారిని కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. వెంకటరమణ కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమార్తె మానేపల్లి సాయిశ్రీ అందించిన ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వెనుక కూర్చున వ్యక్తికి ఏ గాయాలు కాలేదన్నారు.

లారీని ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు

గండేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారం ప్రకారం.. జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు గండేపల్లి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

యువకుడికి తీవ్రగాయాలు

గండేపల్లి మండల యల్లమిల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కెనాయకంపల్లి నుంచి యల్లమిల్లి వెళ్తున్న పాల వ్యాను ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో మోటారుసైకిల్‌పై ఉన్న యల్లమిల్లికి చెందిన మామిడిపాక ఈశ్వర్‌కల్యాణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రాజమండ్రి తరలించారు.

మిఠాయి కొనొచ్చేలోపు మోటారుసైకిల్ డిక్కీలోని

రూ.5 లక్షల దొంగతనం

అల్లవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోడూరుపాడు సెంటర్ వద్ద మంగళవారం మోటారు సైకిల్ డిక్కీలో ఉంచిన రూ.5లక్షల నగదు చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లవరం మండలం గూడాల గ్రామానికి చెందిన మోకా వెంకటేశ్వరరావు-సత్యవతి దంపతులు అమలాపురం బ్యాంకులో రూ.5లక్షల నగదు డ్రా చేసుకుని మోటారుసైకిల్ డిక్కీలో ఉంచారు. కోడూరుపాడు సెంటర్‌లో మిఠాయి కొట్టు వద్ద ఆగి మిఠాయి కొనుగోలు చేశారు. తర్వాత చూస్తే మోటారుసైకిల్ తాళం కనిపించకపోవడంతో వెంకటేశ్వరరావు ఇంటి వద్ద నుంచి మరో తాళాన్ని తెప్పించి మోటారుసైకిల్ డిక్కీ తెరవగా డిక్కీలో ఉంచిన రూ.5లక్షల నగదు, సెల్‌ఫోన్ మాయమైనట్టు గుర్తించి అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేశామని, రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్‌ను సందర్శించిన విద్యుత్ సౌదా హైడల్ డైరెక్టర్



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో పర్యటిస్తున్న హైడల్ డైరెక్టర్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్, సిబ్బంది

మోతుగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్‌లో బుధవారం విజ యవాడ విద్యుత్ సౌదా హైడల్ డైరెక్టర్, ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఫైనాన్స్ సృజయ్ కుమార్ పర్యటించారు. కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఏపీ జెన్కో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 230మెగావాట్ల 5,6 యూనిట్ల జల విద్యుత్ కేంద్రం పనులను పరిశీలించారు. 5,6 యూనిట్ల పనులకు సంబంధించి ఓవల్ ఆఫీస్ బటర్సై వాల్ నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అలాగే 5, 6 యూనిట్ల పెన్‌స్టాక్ పైప్లైన్ పనులను పరిశీలించారు. సివి ల్ పనుల ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణని అడిగి తెలుసుకున్నారు. 5,6 యూనిట్లకు సంబంధించి సివిల్, మెకానికల్ పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయన్నారు. సాధ్యమైనంత త్వరగా 5,6 యూనిట్ల పనులను పూర్తి చేస్తే ఇప్పుడున్న 460 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి తోడు మరో 230 మెగావాట్లు తోడై మొత్తంగా 690 మెగావాట్ల ఉత్పత్తి ఈ జల విద్యుత్ కేంద్రం నుంచి ఉత్పత్తవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎత్తిపోతల పనులకు సంబంధించి అప్పర్ సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి బయలుదేరారు. కార్యక్రమంలో విజయవాడ హైడల్ సివిల్ సీఈ పి.రవీందర్‌రెడ్డి, టీయూఎన్ శ్రీనివాస్, ఎస్సీ హైడల్ ఎం.విజయవాడ సివిల్ హైడల్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వెంకట రాజారావు, ఎస్సీ చిన్నకామేశ్వర రావు, టెక్నికల్ డీఈ వరప్రసాద్, సివిల్ ఎస్సీ చం ద్రశేఖర్ రెడ్డి, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగ శ్రీనివాస్, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వర ప్రసాద్ సివిల్, ఏడీఈలు కొండబాబు, నరసింహులు అసిస్టెంట్ ఇంజనీర్లు పవన్ విజయ్ ఉన్నారు.

అవిశ్వాస తీర్మాన సమావేశం రద్దు

సామర్లకోటలో మున్సిపల్ కౌన్సిలర్ల అసహనం

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి.అరుణపై సొంత పార్టీకి చెందిన 24 మంది వైసీపీ కౌన్సిలర్లు రెండోదఫా పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశం హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం రద్దు చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కౌన్సిల్‌హాలులో సమావేశాన్ని రద్దు చేసినట్టు ప్రకటించి తిరిగి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ముందుగా ఇచ్చిన నోటీసుల మేరకు వైసీపీకి చెందిన 24 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. సదరు సమావేశానికి హాజరుకావాల్సిన ప్రత్యేకాధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు హాజరుకాకపోవడంతో హైకోర్టు ఆదేశాలను ఆర్డీవో ద్వారా కమిషనర్ తెలుసుకుని కౌన్సిలర్లకు సదరు సమావేశం రద్దయినట్టు తెలియజేశారు. దీంతో కౌన్సిలర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. మెజార్టీ సభ్యులు సమావేశానికి హాజరైనట్టు గుర్తించి తమకు ఆర్డీవో నుంచి లేఖలు ఇస్తే తాము సమావేశం నుంచి వెళ్లిపోతామని స్పష్టంచేశారు. దీంతో కమిషనర్ కాకినాడలో ఉన్న ఆర్డీవో మల్లిబాబుతో ఫోన్ ద్వారా చర్చించి ఆర్డీవో సంతకంతో కూడిన లేఖలను హాజరైన కౌన్సిలర్లకు అందజేశారు. దీంతో పరిస్థితి తాత్కాలికంగా సద్దుమణిగింది.

'ఏలేరు'లో తగ్గిన నీటి నిల్వలు

ఏలేశ్వరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. బుధవారం ఎగువ ప్రాంతం నుంచి 1175 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. కాగా 85.53 మీటర్ల స్థాయిలో 22.02 టీఎంసీలు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

రేపు లక్ష గాజుల అలంకరణ

కాకినాడ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నగరంలోని సూర్యారావుపేటలో గల బాలాత్రిపురసుందరి అమ్మవారు శుక్రవారం ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు లక్ష గాజుల అలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిస్తారని ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. ఆ గాజులను శనివారం ఆలయానికి వచ్చే మహిళలకు ప్రసాదంగా వితరణ చేస్తామని చెప్పారు.





కాకినాడలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ రాజశేఖరం, టీడీపీ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



పిఠాపురంలో టీడీపీ పట్టణ, మండల కమిటీలు, క్లస్టర్, గ్రామ, వార్డు, బూత్ కమిటీల సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

టీడీపీ శ్రేణులు సేవాభావంతో ముందుకెళ్లాలి

సిటీ, పట్టణ, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాల్లో ఎమ్మెల్యే కొండబాబు, మాజీ ఎమ్మెల్యే వర్మ

కాకినాడ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆశయాలు, పవిత్ర లక్ష్యాలు, ప్రజాసేవ భావంతో నాయకులు, కార్యకర్తలు ముందుకెళ్లాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. స్థానిక సూర్యకళా మందిరంలో బుధవారం ఆయన అధ్యక్షతన కాకినాడ సిటీ నియోజకవర్గ టౌన్, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీల ప్రమాణస్వీకారోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, నియోజకవర్గ పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత పాలకులు బెదిరింపులు, దౌర్జన్యాలకు గురిచేసినా పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇచ్చి ముందుకు తీసుకెళ్తామన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ మేయర్ సుంకర పావని-తిరుమలకుమార్, నాయకులు నృసింహదేవర విశ్వనాథం, గ్రంధి నారాయణరావు, కొండమూరి సత్యనారాయణ, గదుల సాయిబాబు, వనమాడి మోహనవర్మ, మల్లిపూడి నాగదీపిక, అంబటి చిన్న, తుమ్మల సునీత రమేష్, ఏవీడీ మెంటారావు, పంతాడి రాజు, వొమ్మి బాలాజీ, కొల్లాబత్తుల అప్పారావు, ఎస్కే రహీమ్, చింతలపూడి రవి, పలివెల రవిఅనంత కుమార్, చింతా పేర్రాజు, ఎంఏ తాజుద్దీన్, అమన్జైన్, బంగారు సూర్యావతి, సీకోటి అప్పలకొండ, వాసంశెట్టి చిట్టప్ప, అంబటి చిన్న, అమలకంటి బలరాం, రెడ్నం సత్తిబాబు, తుమ్మల కొండలరావు, సంగాని నాగేశ్వరరావు, గుజ్జు దుర్గ, అంబటి క్రాంతి, కొపనాతి నాగకుమారి, కొల్లు కుమారి, కలగా సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): టీడీపీని మరింత పటిష్ఠం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కల్యాణ మండపం ఆవరణలో టీడీపీ పట్టణ, మండల, గ్రామ, వార్డు, బూత్, క్లస్టర్, యూనిట్ కమిటీల ప్రమాణస్వీకారోత్సవం బుధవారం జరిగింది. అధ్యక్షులు, ఇతర ప్రతినిధులతో వర్మ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటూ వారికి చేదోడువాదోడుగా నిలవాలని కోరారు. పార్టీ కోసం కష్టించి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని వర్మ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహా సంస్థానంలో అనఘా సత్యదత్త వ్రతాలు



పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో బుధవారం సామూహిక అనఘా దత్త వ్రతాలు నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులకు అభిషేకాలు జరిపి గో పూజ చేశారు. ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత'

పెదపూడి (కరప), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత అని, కార్తీకమాసంలో నిర్వహించే వనసమారాధన వెనుక అంతరార్థం అదేనని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి మండలం గొల్లలమామిడాడలో మండల శెట్టిబలిజ సంఘం బుధవారం ఏర్పాటుచేసిన వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఉసిరి, మర్రిచెట్లకు పూజ చేసి అందరితో కలిసి భోజనం చేశారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, శెట్టిబలిజ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ హోల్సేల్ పండ్ల వ్యాపారి నాగం వెంకన్న కుటుంబ సభ్యుల సౌజన్యంతో బుధవారం సామర్లకోట-పెద్దాపురం రోడ్డులోని మామిడితోటలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద పండితుల వేదమంత్రోచ్చారణలతో నాగం అశోక్ దంపతులు పూజలు చేశారు. అనంతరం సుమారు రెండు వేల మంది సహపంక్తి భోజనాలు చేశారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు చెందిన పండ్ల వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని వినతి

పెద్దాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి వస్తున్న ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బస్సులు బయల్దేరే ఏర్పాటు చేయాలని, రిక్వెస్ట్ స్టాపుల్లో బస్సులు ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి క్రాంతికుమార్ కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు భానుకుమార్కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, సిరపురపు శ్రీనివాస్, గరగపాటి పెంటయ్య, హనుమంతు, కూనిరెడ్డి అప్పన్న, రొంగల సుబ్బలక్ష్మి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

44 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ (సార్వా) సీజన్లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సబ్ డివిజన్ పరిధిలో 44 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి తెలిపారు. పిఠాపురం మండలంలో 23, గొల్లప్రోలు మండలంలో 8, కొత్తపల్లి మండలంలో 13 కేంద్రాలు ప్రారంభించామని ఆమె చెప్పారు. తేమ శాతం 17 ఉన్న ధాన్యానికి ప్రభుత్వ నిర్ణయించిన కనీస మద్దతు ధర 75 కిలోలు సాధారణ రకానికి రూ.1,777, ఎ-గ్రేడ్కు రూ.1792 రైతులకు లభిస్తుందని చెప్పారు. రైతులు ఎవరు ఇంతకంటే తక్కువ ధరకు తమ పంటను విక్రయించవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కనీస మద్దతు ధరలపై గ్రామాలు, పట్టణాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన ర్యాలీ

పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు ప్రభుత్వం జారీ చేసిన జీవోలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ఆధ్వర్యంలో బుధవారం పిఠాపురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వైసీపీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా పాడా కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ పీడీ చైత్రవర్షిణికి వినతిపత్రం అందజేశారు.

కాకినాడ (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నగరంలోని జడ్పీ సెంటరు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో మల్లిబాబుకు వినతిపత్రం అందజేశారు. పోలీసులు వీరి ర్యాలీని జడ్పీ సెంటర్లో నిలువరించారు.



జీజీహెచ్లో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

'న్యుమోనియాపై అప్రమత్తంగా ఉండాలి'

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని జీజీహెచ్ పీడియాట్రిక్ లెక్చర్ గ్యాలరీలో హెచ్వోడీ డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో న్యుమోనియా వల్ల వచ్చే మరణాలను ఎలా నివారించాలో తల్లిదండ్రులకు, నర్సింగ్ సిబ్బందికి, నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. న్యుమోనియా వ్యాధిని ఏ విధంగా నివారించాలి, ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి, అప్రమత్తంగా ఉండి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స పొందే విధానాలను వివరించారు. ఇన్చార్జి డీఎంహెచ్వో డాక్టర్ ఎస్.చలమయ్య, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శశి, డాక్టర్ విజయశేఖర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కోమల, పీడియాట్రిక్స్ వైద్య నిపుణులు డాక్టర్ బుర్రి రాంబాబు, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో న్యుమోనియాపై రోగులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా రక్తహీనత వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఇది రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి తెలియజేశారు. చిన్నారుల్లో రక్తహీనత లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సెంటర్ వైద్యాధికారి డాక్టర్ బత్తుల జయరాం, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థులు చదువుకునేందుకు అనువైన వాతవరణం కల్పించాలి'



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

సర్పవరం జంక్షన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో తరగతి గదిలో బోధించిన పాఠాలను ఇంటి వద్ద విద్యార్థులు చదువుకునేందుకు అనువైన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలని ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్ కోరారు. బుధవారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు (పీటీఎం)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో నాలుగు నెలల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని, పిల్లలను వేకువజామునే నిద్రలేపి చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేది పదో తరగతి అన్నారు. పిల్లల చదువు, క్రమశిక్షణ, నడవడికపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థుల చదువులో ప్రగతి, ఉపాధ్యాయుల బోధన, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు కందుకూరి పాల్రాజు, ఉద్దగిరి మూర్తి, నాగార్జున, జగదీష్, సూరిబాబు, సుమన్ వివరించారు.

రెండు దఫాలు సమావేశాలు ఏర్పాటుచేసి


కౌన్సిలర్లను అవమానించారు

అధికారులపై చర్యలు తీసుకోవాలి: సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ జాన్మోజెస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాన్మోజెస్, కౌన్సిలర్లు

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అరుణపై 24 మంది కౌన్సిలర్లు ఏకపక్షంగా అవిశ్వాసం ప్రకటిస్తూ అధికారులకు నోటీసులు జారీ చేస్తే రెండు దఫాలు సమావేశాలను నీరుగార్చి తమను తీవ్రంగా అవమానించిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్మోజెస్, పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అవిశ్వాస తీర్మానం రద్దు చేసినట్టు సమావేశానికి హాజరైన తర్వాత అర గంటకు కమిషనరు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. తాము నిబంధనల మేరకు ముందుగా నోటీసులు ఇచ్చామని, అధికారులు తాత్సారం చేసి తమకు ఎటువంటి సమాచారం చెప్పకుండా సమావేశాన్ని రద్దు చేశామని ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పట్టణ అభివృద్ధిని అడ్డుకుంటున్నట్టు కొందరు చేస్తున్న ఆరోపణలను మోజెస్ తిప్పికొట్టారు. అధికారుల తాత్సారాన్ని తీవ్రంగా పరిగణించి మొత్తం 24 మంది కౌన్సిలర్లు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులను హెచ్చరించారు. సమావేశంలో గోకిన సునేత్రాదేవి, ఆవాల లక్ష్మీనారాయణ, పాలిక కుసుమ, రెడ్నం సునీత, పాగా సురేష్కుమార్, సేపేని సురేష్, వారా పాప, స్వయంభారపు వీరభద్రరావు, రెడ్డి కుమారి, చిట్టిమాని రాఘవ తదితరులు పాల్గొన్నారు.



ప్లస్ టు విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న డీఎస్పీ బంగార్రాజు

పేద విద్యార్థినులకు సైకిళ్ల వితరణ

కరప, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరప జిల్లా పరిషత్ హైస్కూల్లో పది మంది ప్లస్ టు విద్యార్థినులకు పూర్వ విద్యార్థి, విజయవాడ డీఎస్పీ ఉడతా బంగార్రాజు బుధవారం సైకిళ్లను అందజేశారు. తన తల్లి అచ్చియ్యమ్మ జ్ఞాపకార్థం దూర ప్రాంతాల నుంచి వస్తున్న పేద విద్యార్థినులకు సైకిళ్లను వితరణ చేసినట్టు ఆయన తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని భవిష్యత్తులో మంచి స్థాయిలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు

వ్యవసాయ శాఖ జేడీ విజయ్కుమార్



డీలర్లకు సూచనలిస్తున్న విజయ్కుమార్

కరప, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు ఎన్.విజయ్కుమార్ హెచ్చరించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాలకు చెందిన ఎరువులు, పురుగు మందుల డీలర్లు, సొసైటీ, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో బుధవారం ఆయన అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి రబీ సన్నద్ధతపై సమీక్షించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం భారీ రాయితీలపై ఎరువులను సరఫరా చేస్తోందన్నారు. కొంతమంది డీలర్లు ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. అమ్మిన ప్రతి బస్తాను ఈ-పోస్లో నమోదుచేసిన తర్వాతే రైతుకు అందివ్వాలన్నారు. గత అనుభవాల దృష్ట్యా ఎక్కడా ఎరువుల కొరత రాకుండా సొసైటీ, ఆర్ఎస్కే సిబ్బంది, ప్రైవేట్ డీలర్లకు మార్క్ఫెడ్ ద్వారా బఫర్ స్టాక్లను పంపిణీ చేస్తామని, అందరూ సహకరించి రైతులకు నిర్దేశిత రుసుముపై సకాలంలో ఎరువులు అందివ్వాలని సూచించారు. అనంతరం డీలర్లకు ఫెర్టిలైజర్ యాక్ట్, సంబంధిత మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. పలువురు డీలర్లు తమ సమస్యలను జేడీ దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని కంపెనీలు సరఫరా చేసే ఎరువులకు ఇతర ఉత్పత్తులను బలవంతంగా అంటగడుతూ డీలర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిని కమిషనరు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డీలర్లపై పడుతున్న ట్రాన్స్పోర్ట్ భారంపై కూడా దృష్టిసారిస్తామన్నారు.

తొలుత జేసీ వలసపాకలలోని పంట పొలాలు, ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 269 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 94వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు చేయగా మొంథా తుఫాన్ వల్ల 21,432 హెక్టార్లలో పంట దెబ్బతిందన్నారు. ప్రభుత్వం రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చి జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు కృషి చేస్తుందన్నారు. రబీ సీజన్లో 70,500 హెక్టార్లలో వరి సాగు చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో కరప సబ్ డివిజన్ ఏడీ కె.బాబూరావు, మూడు మండలాల ఏవోలు ఇమ్మిడిశెట్టి సత్య, వి.అశోక్, ప్రశాంతి, ఏఈవోలు, వీఏఏలు, సొసైటీల సీఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

18న సీపీఐ రాష్ట్రవ్యాప్త ఆందోళన

కాకినాడ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం-సమానత్వం, జనగణనలో కులగణన చేపట్టాలనే నినాదంతో ఈ నెల 18న తలపెట్టిన సీపీఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. స్థానిక పీఆర్ భవన్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం తోకల ప్రసాద్ అధ్యక్షతన బుధవారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధు మాట్లాడుతూ డిసెంబరు 26న 'చలో ఖమ్మం' పేరుతో జరిగే సీపీఐ వందేళ్ల సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25 నుంచి వచ్చేనెల 26వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా శత వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పప్పు ఆదినారాయణ, ఎ.భవానీ, బొబ్బిలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కరప, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన సముపార్జన కోసం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వేళంగి శాఖా గ్రంథాలయాధికారి పాట్నీడి వెంకటరంగయ్య సూచించారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ప్రతిరోజు వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం, క్విజ్ అంశాల్లో పోటీలు నిర్వహించి చివరిరోజు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వివిధ పోటీల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా 58వ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పంచాయతీ చెరువు ఆక్రమణ అడ్డగింత

తాళ్లరేవు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ పరిధిలోని దిండి గ్రామంలో 0.63 సెంట్ల పంచాయతీ చెరువును గుబ్బల మహేష్ ఎక్స్కవేటరుతో దౌర్జన్యంగా పూడ్చివేశాడు. దీనిని పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ బుధవారం అడ్డుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పూడ్చివేయడంపై కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కార్యదర్శి చెప్పారు.

'ధాన్యాన్ని మద్దతు ధరకే విక్రయించాలి'



రైతులతో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రామ్కుమార్

సర్పవరం జంక్షన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు కష్టించి పండించిన ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకి రూ.2,389 మద్దతు ధర ప్రకటించిందని, తక్కువ రేటుకి దళారులకు విక్రయించకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని పండూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చిలుకూరి రామ్కుమార్ కోరారు. పండూరు రైతు సేవా కేంద్రం వద్ద ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ సమయంలో కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అనంతరం సొసైటీ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సొసైటీ కార్యదర్శి గొల్లపల్లి సత్తిబాబు, సభ్యులు నందిపాటి సురేష్, వీరబాబు, నండూరి సత్తిబాబు, నీటి సంఘం అధ్యక్షుడు అమ్మిరాజు పాల్గొన్నారు.



క్రీడాకారులను సత్కరిస్తున్న టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ కృష్ణకుమారి

టెన్నికాయిట్ విజేతలకు సత్కారం

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాలలో ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన 42వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన కె.శివశంకర్ ప్రసాద్ 2వ, బి.సత్యనారాయణ 3వ, ఎన్. గౌతమ్సంజయ్ 4వ స్థానాల్లో నిలిచారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జమ్ము కశ్మీర్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను టెన్నికాయిట్ అసోసియేషన్ కాకినాడ జిల్లా ప్రెసిడెంట్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఎ.కృష్ణకుమారి దుశ్శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమేష్, కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవివర్మ, కోచ్ పి.రామారావు పాల్గొన్నారు.

జీవన ఎరువులే భూములకు ఆరోగ్యరక్ష

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండూరు రైతు సేవా కేంద్రం ఆవరణలో మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొలంబడి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ డివిజన్ సహాయ సంచాలకురాలు దుర్గాలక్ష్మి మాట్లాడుతూ జీవన ఎరువులే భూములకు ఆరోగ్య రక్ష అన్నారు. రైజోబియం, అజిటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, ఫాస్ఫో బ్యాక్టీరియా, మైకోరైజావేమ్, ద్రవ జీవన ఎరువులు సామర్లకోటలోని విత్తన అనుసరణీయ పరిశోధనా కేంద్రం, కాకినాడ ఏడీ కార్యాలయ ఆవరణలో గల బీఎఫ్ఎల్ ల్యాబ్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని పంటల్లో వాడే విధానాన్ని రైతులకు సమగ్రంగా వివరించారు. ఏఈవో శాంతికమల, రూప, వీఏఏలు ఎంవీ రమణ, జాయ్, ఉండూరు పీఏసీఎస్ అధ్యక్షుడు బత్సల వెంకటరమణమూర్తి, సలాది తాతాజీ, కొప్పిరెడ్డి వీరాస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పులిమేరులో అమరవీరుల సంస్మరణ సభ

పెద్దాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వర్ధంతి సందర్భంగా మండలంలోని పులిమేరు గ్రామంలో బుధవారం అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ పీడిత జన విముక్తి కోసం ఎందరో వీరులు పోలీసుల బూటకపు ఎన్కౌంటర్లలో అమరులయ్యారని, వారిని స్మరించుకోవడమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్యూ (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి సతీష్, గ్రామ నాయకులు గుడాల నారాయణరావు, బీడీల నాగేశ్వరరావు, భూషణం, శివాజీ, తుంగపల్లి సూజం, దాకే మరిడమ్మ తదితరులు పాల్గొన్నారు.

'తడి, పొడి చెత్త సేకరణ తప్పనిసరి'

గండేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వారానికి రెండుసార్లు గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్ సూచించారు. ఆయన గండేపల్లిలో పర్యటించి పంచాయతీ కార్మికులు చెత్త సేకరణ ఎలా చేస్తున్నారో పరిశీలించారు. సంపద తయారీ కేంద్రం పరిశీలించి వినూత్న ఆలోచనతో తీర్చిదిద్దిన పంచాయతీ కార్యదర్శి ఫణీంద్రకుమార్‌ను అభినందించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నిరుపేదలకు గృహాలు మంజూరు : ఎమ్మెల్యే శిరీషదేవి


గృహప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే

రంపచోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి గృహాలు మంజూరు చేశామని ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం చినగెద్దాడలో పీఎం జన్మన్ పథకంతో నిర్మించిన ఇంటిని ఆమెతో పాటు ఐటీడీఏ పీవో బి.స్మరణ్ రాజ్ కొబ్బరికాయలు కొట్టి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఏడుమండలాల్లో 3,344 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ పీఎం జన్మన్, గ్రామీణపథకాల ద్వారా మంజూరైన గృహాల పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో మైనార్టీ బోర్డ్ చైర్మన్ షేక్ సుభాని, తహశీల్దారు పి.బాలాజీ, ఎంపీడీవో పీవీవీఎస్ ప్రసాద్, ఈఈ ఎ.రవికుమార్, డీఈ రామచంద్రమూర్తి, ఏఈ సత్యనారాయణ, ఏపీఎం గొర్లె కిషోర్, నాయకులు స్వప్నకుమారి, అన్నవరం, అన్నిక అప్పారావు పాల్గొన్నారు.

మోతుగూడెం(ఆంధ్రజ్యోతి):చింతూరు మండలం చదలవాడ పంచాయతీ ఎర్రగొండ పాకల గ్రామంలో ప్రధానమంత్రి జన్మన్ పక్కా గృహాల పథకం ద్వారా కొండరెడ్లకు మంజూరైన గృహాలను బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ జమాల్‌ఖాన్ , చదలవాడ గ్రామపంచాయతీ సర్పంచ్ కుంజా తిరుపతిరావు గృహప్రవేశం చేశారు. తహసీల్దార్ హుస్సేన్, ఏపీవో రామతులసి, ఎంపీడీవో శ్రీనివాస్‌దొర, హౌసింగ్ ఏఈ అరవింద్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సింహాద్రి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, హౌసింగ్ సీఈవో పార్వతి, మాజీ సర్పంచ్ సోడి శ్రీను, ఎండీ జహంగీర్, పి.సాల్మన్ రాజు పాల్గొన్నారు.

వై.రామవరం(ఆంధ్రజ్యోతి):మండలంలోని చవిటి దిబ్బలు గ్రామంలో బుధవారం గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో పీఎం జన్ మన్ పథకంలో నిర్మించిన గృహ ప్రవేశాల కార్యక్రమం జరిపారు. ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి లబ్ధిదారులకు గృహనిర్మాణ మంజూరు పత్రాలను అందజేశారు. .

ఎటపాక(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణంతో పేదలకు సొంతింటికల నెరవేరిందని తహసీల్ధార్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. 2021-22లో పీఎంఏవై గ్రామీణ పథకం కింద మంజూరై నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను బుధవారం గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని రాయనపేట, పిచుకలపాడు,గొమ్ము కొత్తగూడెం, గౌరిదేవిపేట గ్రామాల్లో ఇళ్లకు గృహ ప్రవేశాలు చేశారు. హౌసింగ్ ఏఈ దుర్గా ప్రసాద్, జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, శ్యామ్ ప్రసాద్, మూడే సతీష్‌కుమార్, వీఆర్వో పండా రామకృష్ణ పాల్గొన్నారు.

'పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూర్చాలి'

ఎటపాక, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాదిలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని, పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని పాడేరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ శశికుమార్ అన్నారు. బుధవారం ఎటపాక మండలంలోని కేఎస్‌పురం ఆశ్రమ ఉన్నత పాఠశాల, సీతాపురం జడ్పీఉన్నత పాఠశాల, గౌరిదేవిపేట జడ్పీఉన్నత పాఠశాలలను ఆ యన పరిశీలించారు. ఈక్రమంలో ఆయన పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఆయన వెంట డీఈవో వినీల్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి సరియం రాజులు ఉన్నారు.

వీఆర్ పురం టూ శ్రీకాకుళం
ఆదివాసీ జేఏసీ సత్యాగ్రహ శాంతియాత్ర

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా కారం తమన్నదొర జిల్లాగా ప్రకటించాలని, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం వెంటనే ఆచరణలోకి తీసుకు రావాలని, గో బ్యాక్ నాన్ ట్రైబల్ టీచర్స్ అంటూ ప్రధాన డిమాండ్లతో ఆదివాసీ జేఏసీ సత్యాగ్రహ శాంతియాత్ర చేపట్టింది. వరరామచంద్రపురం మండలం కొటారుగొమ్ములో నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన ఈ యాత్ర బుధవారం చింతూరు మండలంలోని మారుమూల గ్రామ మైన సూరకుంట చేరుకుంది. ఈ సందర్భంగా యాత్ర రథసారధి రామారావు దొర మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడా దిన్నర అయిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదివాసీ యువతకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. ఎటపాక జడ్పీటీసీ ఉబ్బ సుస్మిత, ఎంపీపీ కోడె కామేశ్వరి, మేడువాయి సర్పంచ్ కారంవెంకటేశ్వర్లు, పేగ సర్పంచ్ పాయం చంద్ర య్య, చింతూరు డివిజను జేఏసీ చేర్మన్ జల్లి నరేష్ ఆదివాసీ సంఘ కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

'వడ్డిగూడెం, వీఆర్‌పురంనకు ఇళ్ల పరిహారం అందజేయాలి'

వీఆర్‌పురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన వీఆర్‌పురం, వడ్డిగూడెం గ్రామాలలోని పోలవరం నిర్వాసిత కుటుంబాలకు ఇళ్లకు సంబంధించిన నష్టపరిహారం త్వరగా నిర్వాసితుల ఖాతాల్లో జమచేయాలని మండల అఖిలపక్షం నాయకులు, టీడీపీ నాయకులు బుధ వారం వీఆర్‌పురం యూనిట్ చింతూరు ఎస్‌డీసీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొర్ర నరేష్‌కుమార్, ముత్యాల సిద్ధార్థ, బొర్ర ఆదినారాయణ, బొర్ర సూరి, వడ్డిగూడెం సర్పంచ్ నర్సమ్మ, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, రాంబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'అక్రమ కట్టడాలను తొలగించండి'

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్ పరిధిలో అక్రమ కట్టడాలను తొల గించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం చింతూరు ఐటీడీఏలో జరిగిన గ్రీవె న్సులో ఇన్‌ఛార్జి పీవో స్మరణ్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ ఏజన్సీలో చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమాచార చట్టం ఉల్లంఘించిన ప్రస్తుత ఎటపాక మండల తహసీల్దార్ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మన్యం లో గిరిజనేతరుల కట్టడాలను తక్షణమే తొల గించాలని, వారిపై ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలన్నారు. గిరిజనేతరులు అక్రమంగా నిర్మిం చుకున్న ఇళ్లకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయవద్దని కోరారు. సచివాలయాలకు చెందిన డిజిటల్ అసిస్టెంట్లను ఆర్ అండ్ ఆర్ పనులు నిర్వర్తించేందుకు డిప్యూట్ చేయడంతో ఆయా కార్యాలయాల్లో పనులు మందగించాయన్నారు. చింతూరు సెంటరులో జూబ్లీ పార్క్‌ను ఆక్రమించుకొని గిరిజనేతరులు వ్యాపార సముదాయాలు నిర్మించుకున్నప్పటికీ అటవీశాఖ అధికారులు చోద్యం చూడడం విడ్డూరమన్నారు. ఈ మేరకు పీవో చర్యలు తీసుకోవాలని శ్రీను కోరారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన టీడీపీ నాయకులు


మంత్రి లోకేష్‌తో దేవీపట్నం టీడీపీ నేత

దేవీపట్నం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన దేవీపట్నం మండలంలోని 44గ్రామాల నిర్వాసితుల సమస్యలను బుధవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌కు దేవీపట్నం మండల టీడీపీ నాయకులు లంకా హరిబాబు, పాసాల సతీష్, నాగార్జున వివరించారు. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వాలన్నారు. గ్రామాన్ని ఖాళీచేసినప్పుడు 18 ఏళ్లు నిండినవారిని అర్హులజాబితాలో చేర్చాలని, సుమారు 1200 మందిని అనర్హులుగా చూపుతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

చింతూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలంలో రెండు వేర్వేరు ప్రమాదాలు బుధవారం జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఎటపాక-చింతూరు మండలాల నడుమ చిమిలివాగు సమీపంలో జాతీయ రహదారి నెం.31పై ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. దీంతో ఏజీ కోడేరుకు చెందిన సవలం శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న శేఖర్‌ను భద్రాచలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అలాగే ఇదే రహదారిపై చింతూరు మండలం గంగన్నమెట్ట సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. గాయపడ్డ వ్యక్తి చింతూరు మండలం గొందిగూడెంనకు చెందిన బందం బొజ్జిగా పేర్కొంటున్నారు. ప్రమాదానికిగల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

డీ పట్టా భూమిలో
గ్రావెల్ అక్రమ తవ్వకాలు


రౌతులపూడి గ్రామశివారు డీ పట్టా భూమిలో తవ్వుతున్న గ్రావెల్

రౌతులపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామశివారు కోర్టు పరిధిలో ఉన్న ఎ.సింహాచ లానికి చెందిన డీ పట్టా భూమిలో పగలు యథేచ్ఛగా లారీల్లో గ్రావెల్ తరలిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలో గల టీడీపీ నేతకు చెందిన 2ఎకరాల ప్రైవేట్ లేఅవుట్‌కు గ్రావెల్ తరలిస్తున్నారని తహశీల్దార్ ఎన్వీ నరేష్‌కు స్థానిక రైతులు సమాచారం ఇచ్చారు. దీంతో తహశీల్దార్ ఎన్వీ నరేష్ గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వచ్చేటప్పటికి ఎక్స్‌కవేటర్‌ను

పరిశీలించిన తహశీల్దార్
కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

అక్కడ నుంచి తరలించేశారు. ఎక్స్‌కవేట ర్‌తో తవ్వకాలు జరిపినట్టు తహశీల్దార్ గుర్తించారు. ఇదే ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన ఇళ్ల స్థలాల లేఅవుట్‌లో గ్రావెల్ తవ్వకాలు నాలుగు అడుగుల లోతు తవ్వడంపై మండిపడ్డారు. ఇళ్ల స్థలాల లేఅవుట్‌లో వైసీపీకి చెందిన నేత జేసీబీతో రాత్రి వేళ తవ్వుతున్నట్టు కొందరు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కోర్టు పరిధిలో ఉన్న డీపట్టా భూమిలో, ప్రభుత్వ ఇళ్ల స్థలాల లేఅవు ట్‌లో గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్ప వని తహశీల్దార్ హెచ్చరించారు. ఈప్రాంతంపై నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. గతంలో ఇక్కడ గ్రావెల్ తవ్విన ముగ్గురికి రూ.60వేలు ఫైన్ వేసినట్టు తెలిపారు.

వనసమారాధనలతో మరింత ఐక్యత


అన్నవరం వనసమారాధన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

అన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు మరింత ఐక్యత సాధించేందుకు దోహదపడతాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. బుధవారం అన్నవరంలో బండారు కుటుంబసభ్యులు నిర్వహించిన కార్తీక వనసమారాధనకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బండారు ముత్యాలరావు, బండారు వెంకటరమణ, బండారు అప్పారావు, కూటమి నాయకులు వెన్నా ఈశ్వరుడు, వీర్ల సూరిబాబు, పలివెల సతీష్, రాజాల చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండ సమీపంలోని మామిడితోటలో పవిత్ర కార్తీకమాసం సందర్భంగా బుధవారం బ్రహ్మకుమారీలు ఘనంగా కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్యఅతిథిగా పాల్గొని బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన శివలింగానికి పూజలు నిర్వహించి అన్నప్రసాదం స్వీకరించారు. ధ్యానం, భజనలు, ఆత్మశాంతి సందేశాలు, సత్సంగం వంటి కార్యక్రమాలు బ్రహ్మకుమారీలు నిర్వహించారు. సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, బ్రహ్మకుమారి ఇన్‌చార్జ్ తులసి, ఏలేశ్వరం, సామర్లకోట ఇన్‌చార్జ్‌లు సుధ, లక్ష్మి ఉన్నారు.

గండేపల్లిలో...

గండేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల శాఖాధికారులు సింగరంపాలెం వెళ్లే దారిలో ఉన్న పామాయిల్‌తోటలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. డీఎల్‌పీవో బాలామణి, ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐఎన్ శ్రీనివాస్, ఏవో కె.చంద్రరావు, కార్యదర్శి ఫణీంద్రకుమార్ హాజరయ్యారు. ముందుగా ఉసిరిచెట్టుకు పూజలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. మల్లేపల్లిలో దార్లంక రాముడు త్రిలోకం ఆధ్వర్యంలో వనసమారాధన చేపట్టారు. మాలధారణ భక్తులు వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

పేదల సొంతింటి కల సాకారానికి ప్రణాళిక


గృహ ప్రవేశంచేస్తున్న మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల గృహాల వ్యవహారంలో గత వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విమర్శించారు. స్థానిక దళిత వాడలో గృహ నిర్మాణ లబ్ధిదారు మోకు రాణి గృహ ప్రవేశ కార్యక్రమాన్ని గృహ నిర్మాణ శాఖ అధికారులు బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేదల కోసం గుర్తించిన స్థలాల వ్యవహారంలో కూడా గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ప్రతి పేదవాడికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు,హౌసింగ్ డీఈ సువర్ణరాజు, ఏఈ ఆనంద్, ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎం వీఆర్ కుమార్, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, కూటమి నాయకులు యాళ్ళ జగదీష్, వెంకట్రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రత్తిపాడు మండలం ఎతైన కొండలపై ఉన్న బురదకోటకు ఎట్టకేలకు పక్కా సిమ్మెంటు రహదారి నిర్మాణం కాబోతుంది. ఉపాధి నిధులు రూ. 2.80లక్షలు మంజూరు కావడంతో బురదకోట కొండ దిగువున ఉన్న ధారపల్లి నుంచి కొండపైన గల కె.మిర్తివాడ వరకు నిర్మించే సిమ్మెంటు రహదారి నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే సత్యప్రభ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీంతో బురదకోట గిరిజనులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు రవా ణా సౌకర్యాలు మెరుగుపరచడం తమ ప్రాధా న లక్ష్యమని తెలిపారు. త్వరలో నియోజకవర్గంలోని దెబ్బతిన్న రహదారులన్నీ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కూటమి నాయకులు కన్నబాబు, కత్తిపూడి బాబి, ఇళ్ళ అప్పారావు, నిమ్మల అప్పారావు, అమరాది వెంకట్రావు, యాళ్ళ జగదీష్, జువ్విన తిరుపతిరావు, లోవరాజు పాల్గొన్నారు.

వైసీపీ నిరసనలు

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను చేయడాన్ని నిరసనిస్తూ బుధవారం ప్రత్తిపాడులో వైసీపీ శ్రేణులు ప్రజా ఉద్యమ ఆందోళన నిర్వహించారు. నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్ వద్ద సమావేశమయ్యారు. అల్లూరి సీ తారామరాజు సెంటర్‌లో బైఠాయించారు. అనంతరం తహశీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు.

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో వైసీపీ నిరసన ర్యాలీ చేపట్టారు. జగ్గంపేట వైసీపీ ఇంచార్జ్, తోట నరసింహం, రాష్ట్ర యువ జన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ ఉన్నారు.

కామరాజుపేటలో గృహ ప్రవేశాలు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ప్రజానిధులు

జగ్గంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గోకవరం మండలం కామరాజుపేట గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులు, గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పీఎం ఆవాస్ యోజన 2.0 గృహప్రవేశాలు ఘనంగా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.

ఉచిత వైద్యశిబిరం

గండేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లిలో బుధవారం ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో పీఏసీఎస్ అధ్యక్షులు దిడ్డి చిన్నశ్రీను ఆధ్వర్యంలో కాకినాడ అంజు ఐకేర్ ఫౌండేషన్ సారథ్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు ప్రారంభించారు. డాక్టర్ తేజ రోగులకు 111 మందికి కంటి పరీక్షలు చేసి పది మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. 20మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఆత్మ డైరెక్టర్ బలిరెడ్డి గణేష్, తెలగరెడ్డి భద్రరావు, కాటేపల్లి భద్రం, బలిరెడ్డి గంగరాజు, కొల్లి త్రిమూర్తులు, తణుకు దుర్గారావు, దార్లక నూకరాజు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గండేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న సింగరంపాలెం, రామయంపాలెం గ్రామాలకు గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలెక్ట్రికల్ ఈఈ బి.వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. సింగరంపాలెం నూతన సబ్ స్టేషన్ నిర్మాణం పనుల్లో భాగంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

20న భవన నిర్మాణ కార్మికుల చలో కలెక్టరేట్ ఆందోళన

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేయాలనే డిమాండ్‌లో నవంబరు 20న చలో కలెక్టరేట్ ఆందోళన విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ప్రత్తిపాడులో భవన నిర్మాణ కార్మికులు సమావేశమయ్యారు. పోస్టర్‌ను భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావులు కార్మికులు ఆవిష్కరించారు. నాయకులు సీరం సత్తిబాబు. వి.రాంబాబు, బి.గోవిందు, ఆర్.రమణ పాల్గొన్నారు.


బొద్దవరంలో గృహ ప్రవేశాలు చేస్తున్న లబ్ధిదారులు

అర్హులందరికీ ఇళ్లు

కోటనందూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇల్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ అన్నారు. బుధవారం బొద్దవరంలో గృహ ప్రవేశాలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు గాడి రాజుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పోతల సూరిబాబు, డి.చిరంజీవిరాజు, వి.గోపి, గెడ్డం కొండయ్యనాయుడు, గొర్లి అచ్చియ్యనాయుడు, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లిబరేషన్ పొలిటికల్ బ్యూరో సభ్యుడు శంకర్

లిబరేషన్ మహాసభలను జయప్రదం చేయండి

ఏలేశ్వరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ పొలిటికల్ బ్యూరో సభ్యుడు వి.శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సీపీఐ (ఎంఎల్) పార్టీ సమావేశం నిర్వహించారు. కడప వేదికగా డిసెంబరు 6, 7 తేదీల్లో జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో కార్మిక, రైతు సంఘాలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బుగతా బంగార్రాజు, ఏగుపాటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనేతరులపై కేసులు నమోదు చేయాలి'

రంపచోడవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ, ఆదివాసీ భూము లను ఆక్రమించుకొని ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా పట్టాలు పొందిన గిరిజనేతరులపై ఎల్‌టీఆర్‌పీ కేసులు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఏజెన్సీలో రెవెన్యూ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ, ఆదివాసీ భూములుకబ్జాలు, అన్యాక్రాంతానికి గురవుతున్నాయన్నారు. గిరిజనచట్టాలు అమలుచేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.

గిరిజన సమాఖ్య జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఎటపాక, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న మారేడిమిల్లిలో జరిగే ఏపీ గిరిజన సమాఖ్య ద్వితీయ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఏపీ గిరిజన సంఘం సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి వాసం రాము పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం కృష్ణవరం గ్రామంలో ఆ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఏజెన్సీలో 1బై70 చట్టం పేరుకే ఉందని, అమలుచేయడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు.

తేటగుంటలో నేడు విస్తృతస్థాయి సమావేశం

తుని రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తుని నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం గురువారం తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షులు చింతమనీడి అబ్బాయి తెలిపారు. దీనికి ఎమ్మెల్యే యనమల దివ్య, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అనంతరం యూనిట్, గ్రామ కమిటీలు, బూత్ కమిటీలు, మండల, క్లస్టర్ కమిటీల ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు.

జీడిమామిడి సస్యరక్షణపై రైతులకు శిక్షణ

రౌతులపూడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శృంగవరం, ఎస్.అగ్రహారం గ్రామాల సచివాలయాల వద్ద బుధవారం మామిడి, జీడిమామిడి సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త చల్లా వెంకటనరసింహ రావు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కాకి నాడ జిల్లా ఉద్యాన అధికారి టి.వీరసిరిల్, ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరిదేవి జాతర

రౌతులపూడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్.పైడిపాల గ్రామంలో గౌరిదేవి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. గౌరిశంకరలను పలు వీధుల్లో బ్యాండ్‌మేళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగించారు. ఈజాతర రెండేళ్లకు ఒక్కసారి జరుగుతుంది. నెల రోజులు అమ్మవారికి పూజలు జరిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.

అయ్యప్ప గురుస్వాములకు సత్కారం

శంఖవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి గ్రామశివారు తోటలో అయ్యప్ప స్వాముల వనసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో స్వాములు భోజనాలు చేశారు. ఈసందర్భంగా 18సార్లు మాల వేసిన గురుస్వాములు చిన్నాల రామకృష్ణ, గంద్రేటి మానీలు, ఎ.వీరబాబు, గౌతు దొరబాబు, డి.వెంకటరమణలను సత్కరించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

కోటనందూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచితంగా ఫిజియోథెరపీ చేస్తున్నట్టు ఫిజియోథెరపిస్టు డాక్టర్ డాక్టర్ సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని అనాథ దివ్యాంగ పిల్లలంతా ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రామశేఖర్, సీఆర్పీ యర్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒకవరం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జగ్గంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. బుధవారం స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని జగ్గంపేట, కిర్లంపూడి, గోకవరం, గండేపల్లి మండలాలకు 20 చెక్కులను లబ్ధిదారులకు అందజే శారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పల రాజు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, బసా వీరబాబు, అడబాల భాస్కరరావు, దేవరపల్లి మూర్తి, చదరం చంటిబాబు, బుర్రి సత్తిబాబు, దిడ్డి శ్రీను, పీల మహేష్, బస్వా చిన్నబాబు, రాయి సాయి , తూము కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన


చిరుధాన్యాలపై రైతులకు వివరిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జగపతినగరం గ్రామంలో ఏవో నాగం సుధా మాధురి అధ్యక్షతన బుధవారం చిరుధాన్యాలు, వాటి ఆధారిత ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ మాలకొండయ్య, ఏవో సంజీవ్ హాజరై చిరుధాన్యాలు వేసుకోవడం వల్ల కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో ఆకుల సురేష్, వ్యవసాయ సహాయకులు రమ్య, మంజూష, మణికంఠ, పలువురు రైతులు ఉన్నారు.

చిరుధాన్యాల వల్ల అనేక ప్రయోజనాలు

గండేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఏడీఏ జి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని యర్రంపాలెం గ్రామంలో వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో చిరుధాన్యాలు వాటి ఉత్పత్తులు శిక్షణ కార్యక్రమం సర్పంచ్ ముత్యాల దుర్గారావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఏడీఏ శ్రీనివాస్, పెద్దాపురం డీఆర్సీ ఏడీఏ మాలకొండయ్య రైతులకు చిరుధాన్యాల ఉత్పత్తులు తయారీ విధానం, మార్కెటింగ్ చేసుకోవడంపై వివరించారు. కార్యక్రమంలో ఏవోలు డి.సంజయ్‌కుమార్, జె.లక్ష్మి, విస్తరణాధికారి చంద్రమౌళి, నాయకులు ముత్యాల భాస్కరరావు, బిక్కిన వెంకట్రావు, వ్యవసాయ సహాయకులు జాన్ క్రిస్టోఫర్, శ్రీను, సురేఖ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయాలి

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 59 గిరిజన గ్రామాలను కలిపి పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయాలని గిరిజన సమావేశం తీర్మానించింది. మండలంలోని ఇ.గోకవరం గ్రామంలో బుధవారం 59 గిరిజన గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గిరిజన మహిళలు సమావేశం అయ్యారు. గిరిజన హక్కుల సాధన సంఘం, పెదమల్లాపురం మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సబ్ ప్లాన్ ఏజెన్సీ గిరిజన గ్రామాలను కలిపి ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సమావేశంలో సాధన కమిటీల నాయకులు టి నాగేశ్వరరావు, గుమ్మడి అన్నవరం, కాము లక్ష్మణ్, మాడం పాపారావు తదితరులు గిరిజన సమస్యలపై ప్రసంగించగా వందలాది మంది గిరిజనులకు పాల్గొన్నారు


సదస్సులో మాట్లాడుతున్న వక్తలు